వార్త

ఆదివారం

12 జనవరి, 2025

# భోగ భాగ్యాల సంక్రాంతి



## తారాతీరం

# అఖిల్ జోడీగా శ్రీలీల?



**అక్కినేని** యంగ్ హీరో అఖిల్ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి చాలా రోజులే అయినా ఆయనకు సరైన హిట్ మాత్రం పడలేదని చెప్పవచ్చు. అఖిల్ 'హలో', 'మిస్టర్ మజ్ను', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్', 'ఏజెంట్'.. ఇలా వరుస సినిమాలు చేసినా సాలిడ్ సక్సెస్ మాత్రం పడలేదు. హ్యాండ్‌సమ్ లుక్స్, అదిరిపోయే ఫిజిక్ ఉన్నా, ఆయన ఖాతాలో ఒక్క సాలిడ్ హిట్ లేకపోవడం గమ నార్హం. అయితే, ఇప్పుడు అఖిల్ చాలా జాగ్రత్తగా తన తరువాతి చిత్రాలను లైన్‌లో పెడుతున్నాడు. తన తరువాతి చిత్రాన్ని మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, తాజాగా ఈ చిత్ర షూటింగ్‌ను అఖిల్ సైలెంట్‌గా ప్రారంభించినట్లు తెలుస్తోంది. రామోజీ ఫిలిం సిటీలో వేసిన సెట్‌లో ఈ చిత్ర షూటింగ్ మొదలైందని చిత్ర వర్గాల్లో టాక్. ఈ చిత్రంలో యంగ్ బ్యూటీ శ్రీలీల కథానాయికగా నటించబోతున్నట్లు తెలుస్తోంది. థమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేయనున్నాయి.

# 'బార్బరిక్'లో ఉదయ భాను!

**తొలి నుంచీ** టాలీవుడ్‌పై ఫోకస్ చేస్తున్న ఉదయభాను సరైన పాత్రలు రాక వెనుకబడిన విషయం తెలిసిందే! బుల్లితెర యాంకర్లు ఎంతో మంది వెండితెరపై తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ జాబితాలో సుమ, ఝాన్సీ, రష్మి, శిల్పా చక్రవర్తి, అనసూయ ఇలా ఎంతో మంది ఉన్నారు. వీరిలో ఉదయభాను కూడా ఒకరు. మొదటి నుంచీ కూడా ఉదయభాను టాలీవుడ్‌పై ఫోకస్ చేస్తూనే ఉంది. సరైన పాత్రలు మాత్రం ఆమెకు రాలేదు. దీంతో, ఆమె ఐటెం సాంగ్స్ సైతం చేసింది. తాజాగా మరో యాంగిల్‌ను చూపించేందుకు ఉదయభాను రెడీ అవుతోంది. విలన్‌గా సత్తా చాటేందుకు భాను సిద్ధమయింది. సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'బార్బరిక్' సినిమాలో ఉదయభాను విలనిజం చూపించబోతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుందట.



ఆదివారం వార్త

12 జనవరి, 2025

## మంచి ముత్యాలు

మీ గౌరవ మర్యాదలు పెరగాలంటే, మంచి గుణాలున్న వారి సాంగత్యాన్ని పెంచుకోండి. చెడు సహవాసం చేయడం కంటే, ఒంటరిగా ఉండటం మంచిది.

**- వివేకానంద**

## కదంబం


సంఘీ'భావం....5

పండుగ ప్రయాణం దుర్భరం

కవర్ స్టోరీ

భోగ భాగ్యాల సంక్రాంతి

స్ఫూర్తి ప్రదాత 10

పట్టు పరికిణి 11

ఈవారం కవిత్వం...12

అతడు

ప్రాచీన జలపాతాలు 14

కథ..20

జీవధ్వని

సాహిత్యం...23

ప్రాచీన తెలుగులో..

మహాపాశుపత బంధ .. 28

ఇంకా...

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## సెంచరీల మనవళ్లున్న తాతయ్య!

### తూర్పు ఉగాండాలో ముసా హసహ్యా కథే వేరు..

**1972లో** 17 యేళ్ల వయసులో తొలి వివాహం, పిల్లల పేర్లు గుర్తు పెట్టుకోవడానికి రిజిస్టర్ నిర్వహిస్తున్న ముసా, ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు తగ్గుతున్నా, దాదాపు దేశాలన్నీ అధిక జనాభాతో బాధపడుతున్నాయి. బహుశా అందుకు కారణం ఇలాంటివారి వల్లే కావచ్చు. ఉగాండాకు చెందిన ఈ వ్యక్తికి 12 మంది భార్యలున్నారు. వారి ద్వారా ఆయనకు 102 మంది సంతానం కలిగారు. వారికి పెళ్లిళ్లు చేయడం ద్వారా మొత్తంగా 578 మందికి తాతయ్యాడు. వారి పేర్లను గుర్తుంచుకునేందుకు ఏకంగా రిజిస్టర్‌నే నిర్వహించాల్సి



వస్తోంది. 102 మంది పిల్లలకు జన్మనిచ్చిన ఆ వ్యక్తి పేరు ముసా హసహ్యా కసేరా. తూర్పు ఉగాండాలోని ముకిజా గ్రామం. ఆయన వయసు ప్రస్తుతం 70 సంవత్సరాలు. ఒక్కో భార్య నుంచి 8,9 మంది పిల్లల్ని కన్నాడు. ఇప్పుడు తన సంతానాన్ని పెంచేందుకు, వారి కడుపు నింపేందుకు నానా పాట్లు పడుతున్నాడు.

1972లో ముసా తొలి వివాహం చేసుకున్నాడు. అప్పటికి ఆయన వయసు 17 యేళ్లే. అనంతరం ఒకరి తర్వాత ఒకరిగా మొత్తం 12 మందిని చేసుకున్నాడు. అయితే, ఇంత మందిని చేసుకుంటూ పోయినా వారిని ఎలా పోషించగలనన్న ఆలోచన తనకెప్పుడూ రాలేదని ముసా హసహ్యా కసేరా చెప్పుకొచ్చాడు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com













# ఆరోగ్యానికి ఇత్తడి

ఇత్తడి పాత్రలో బియ్యప్పిండి ఉప్మా వండితే అద్భుతంగా ఉంటుంది. అందులో దిబ్బరొట్టే చేస్తే ఆ రుచే అమోఘం. కానీ ఇప్పుడెవరు ఇత్తడి పాత్రలు వాడుతున్నారని అంటారా? ఇప్పుడవే ట్రెండు. ఇత్తడితో చేసిన కుక్కర్లు, పోపుల పెట్టెల దగ్గర నుంచి క్యారేజీలు, గరిటెలు, గిన్నెలు, గ్లాసులు.. ఇప్పుడు ట్రెండుగా మారుతున్నాయి. ఇవి చూడ్డానికి బాగుంటాయి. ఆరోగ్యానికీ మంచిదన్న కారణంతో వీటికి ఆదరణ పెరుగుతోంది.















## 'సంఘీ' భావం



# పండుగ ప్రయాణం దుర్భరం

పండుగలు వచ్చాయంటే తమ స్వగ్రామాలకు వెళ్లి ఆనందంగా గడుపుదామని అనుకునే కుటుంబాలకు బస్సులు, రైళ్ల అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురౌతున్నారు. ఎన్ని ప్రత్యేక బస్సులు వేసినా, రైళ్లను నడిపినా ఆశించిన మేరకు ప్రయాణ వెసులుబాటు కలగడం లేదు. ఈ సారి సంక్రాంతి పండుగకు తెలంగాణ నుంచి 6,432 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. గత సంక్రాంతికి 4,484 బస్సులు నడుపుతామని చెప్పినప్పటికీ, ప్రయాణీకుల నుంచి తాకిడి ఎక్కువ కావడంతో 5,296 బస్సులను నడిపారు. అయినప్పటికీ సమస్యలు ఎదురయ్యాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 5 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. అయితే ఇవి సంక్రాంతి పండుగకు ఉన్న డిమాండ్‌కు ఏమాత్రం సరిపోవడం లేదు. గతంలో ప్రత్యేక బస్సుల పేరుతో ఛార్జీలను పెంచేవారు. అయితే ఈసారి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఛార్జీల పెంపు నుంచి ఉపశమనం కలిగించారు. మరోపక్క రైళ్ల పరిస్థితి కూడా ఇంకా దారుణంగా ఉంది. సుమారు మూడు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం తెలంగాణ నుంచి ఆంధ్రకు వెళ్లే అన్ని రైళ్లలో రిజర్వేషన్ టికెట్లు లభ్యం కావడం లేదు. గతంలో నాలుగు నెలల ముందుగా రిజర్వేషన్ చేసుకునే విధానం ఉండేది. ప్రస్తుతం దానిని రెండు నెలలకు తగ్గించారు. డిసెంబరు ఒకటవ తేదీ నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది. అంతకు ముందు నెలల్లో నాలుగు నెలల రిజర్వేషన్ సమయం ఉండటంతో అక్టోబర్ నెలలోనే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు చేసుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌తో పాటు వరంగల్, ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి అనకాపల్లి తదితర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టింది. అదేవిధంగా నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ నుంచి బెంగళూరుకు ఇతర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేసినా, డిమాండ్‌లో కనీసం 50 శాతం వరకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడింది. సంక్రాంతి పండగకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్య ప్రయాణీకులు ఆంధ్రకు తరలివెళతారు. మూడు, నాలుగు రోజుల పాటు స్వగ్రామాల్లో గడిపి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ప్రస్తుతం రైళ్లలో వెళ్లడానికి, తిరిగి వచ్చేందుకు కూడా రైళ్లు అందుబాటులో లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పటి నుంచి హైదరాబాద్ నగరానికి వలసలు బాగా పెరిగాయి. రాష్ట్రం విడిపోయినా హైదరాబాద్‌లో పనులు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా ఐటి రంగం బెంగళూరు తరువాత హైదరాబాద్‌లో బాగా విస్తరించింది. ఐటి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండటంతో లక్షలాది మంది హైదరాబాద్‌కు తరలివచ్చారు. ప్రస్తుతం వీరు ఇక్కడే ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లో వలే ఆంధ్రలో ఐటి రంగం అభివృద్ధి చెందలేదు. పైగా గత ఐదేళ్లలో చాలా కంపెనీలు ఆంధ్ర నుంచి తెలంగాణకు తరలివచ్చాయి. దీనితో ఆయా కంపెనీలలో పనిచేసే సిబ్బందిని కూడా తెలంగాణకు బదిలీ చేశారు. దీనితో గత ఐదేళ్లలో హైదరాబాద్‌కు వస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. మరోపక్క బెంగళూరులో జీవనం అత్యంత ఖరీదైనదిగా మారింది. ఇంటిని అద్దెకు తీసుకుని ఉండాలంటే హైదరాబాద్ కంటే మూడింతలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనితో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లిన వారే కాకుండా అక్కడ పనిచేస్తున్న కర్ణాటకవాసులు కూడా హైదరాబాద్ వైపు ఆసక్తి చూపించి తరలివచ్చారు. దీనితో హైదరాబాద్ నుంచి ఇటు ఆంధ్రాకు, అటు కర్ణాటకకు తరలివెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతిరోజు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు, విశాఖపట్నం, విజయవాడలకు వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా రద్దీ అధికంగా ఉంటుంది. శని, ఆదివారాల్లో అదనంగా ఛార్జీలు వసూలు చేస్తుంటారు. ఇక సంక్రాంతి పండుగ సమయంలో ఈ రద్దీ మరింతగా పెరిగింది. అటు ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడం, రైళ్లలో రిజర్వేషన్లు ముగియడంతో ప్రయాణీకులు ప్రైవేటు సర్వీసులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనితో ప్రైవేటు ఆపరేటర్లు దోపిడీ వ్యవస్థకు తెరలేపారు. సాధారణ ఛార్జీలపై ఏకంగా రెండు నుంచి మూడింతలు ధరలు పెంచారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు సాధారణంగా 15 వందల రూపాయలు ఉంటే ప్రస్తుతం 2 వేల 500కు పెంచారు. అదేవిధంగా విజయవాడకు రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని కాలం చెల్లిన బస్సులను కూడా రోడ్డుపైకి తీసుకువస్తున్నారు. బహిరంగంగానే ఛార్జీలు వసూలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఆన్‌లైన్‌లోనే రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు బస్సులు స్టేజీ క్యారేజీలుగా తిప్పకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినా కూడా దానిని తుంగలో తొక్కి ప్రైవేటు ఆపరేటర్లు బస్సులు నడుపుతున్నారు. ఇలాంటి పండుగ సమయాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని దోపిడీ విధానానికి పాల్పడుతున్నా, వారిపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# భోగ భాగ్యాల సంక్రాంతి..

కవర్ స్టోరీ
పి.యస్.యమ్.లక్ష్మి

పండగలు వస్తున్నాయ్, పోతున్నాయ్.. అవి అసలు ఎందుకొస్తున్నాయో, ఏ కాలంలో వస్తున్నాయో, ఆ సమయంలో మనం ఏం చెయ్యాలో అన్నీ మర్చిపోతున్నాం. పండగ కనుక పిండివంటలు చేసుకోవాలి.. ఇప్పుడా చేసుకునే ఓపిక కూడా లేదు.. స్వగృహాకి ఆర్డర్ ఇచ్చేస్తే వెళ్ళి తెచ్చుకోవటమో, డోర్ డెలివరీనో.. ఆ పని అయిపోయింది. కొత్త బట్టలు .. నెలకో రెండు కొనుక్కుంటూనే వున్నాం, పార్టీలకీ ఫంక్షలకీ వేసుకుంటూనే వున్నాం. ఇంక పండక్కి ప్రత్యేకించి ఎందుకు.. అంతే. పండగ అయిపోయింది.

ఇట్లాగే వున్నాయండీ ఈ బిజీ సిటీ లైఫుల్లో పండగలు, మామూలుగా వచ్చి పోయే సెలవు రోజుల్లాగా..

అయితే, డబ్బులున్నవాళ్ళు క్లబ్బులు, పబ్బులకెళ్ళి కొత్త స్టైల్స్‌లో పండగ చేసుకుంటుంటే, మధ్య తరగతివాళ్ళు కుటుంబ సభ్యులంతా కలిసివున్న రోజే పండగ అనుకుంటే, డబ్బులు లేని వాళ్ళకి కడుపు నిండిన రోజే పండగ. ఈ పండగల ప్రసక్తి ఎందుకు అంటే, ఈ నెలలో సంక్రాంతి వస్తోంది కదండీ. కొంచెం గుర్తు చేసుకుందామని. సంక్రాంతిని కొందరు పెద్ద పండగ అంటారు. ఇంకొందరు పెద్దల పండగ అంటారు. వ్యవసాయదారులకి పంటల పండగ. పంటలు ఇంటికి వచ్చి ఇల్లంతా సంతోషాలు వెల్లివిరిసే సమయం. పాడి పంటలతోబాటు సర్వ శోభలూ, సంతోషాలూ తెస్తుందిగనుకే కవులు ఈ సంక్రాంతిని సంక్రాంతి లక్ష్మీ, పుష్య మాసంలో వస్తుందిగనుక పౌష్య లక్ష్మీ అనీ కవితలల్లుతారు. ఈ పండగ పెద్ద పండగ అని కొత్త అల్లుళ్ళని ఇంటికి పిలిచి కానుకలు ఇస్తారు. పెళ్ళయిన తర్వాత మొదటిసారి పండగకి మామగారి ఇంటికి వచ్చిన అల్లుడు భార్యతో మాట్లాడటానికి పడే పాట్లు, కొంటె మరదళ్ళ పరిహాసాలు.. ప్రత్యేకించి ఆ సన్నివేశాలను తమ రచనలలో చొప్పించే రచయితలూ, అవి చదివి రింగులు వేసుకునే పాఠకులూ.. ఇవన్నీ ఒకప్పటి ముచ్చటలయి పోయాయి. సూర్యుడు నెలకొక సారి ఒక్కొక్క రాశిలో ప్రవేశిస్తాడు కదా. దీనినే సంక్రమణం, లేకపోతే సంక్రాంతి అంటారు. ఇలా ఏడాదికి 12 సంక్రాంతులొస్తాయి. వీటన్నింటిలో ముఖ్యమైనవి మకర సంక్రాంతి, కర్కాటక సంక్రాంతి. భూమధ్య రేఖకి దక్షిణాన ప్రయాణించే సూర్యుడు ఉత్తర దిశగా తిరిగినప్పుడు ఉత్తరాయణ పుణ్య కాలం అంటారు. ఈ ఉత్తరాయణ సమయంలో సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. అందుకే దానిని మకర సంక్రాంతి అంటారు. దక్షిణాయన సమయంలో సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశిస్తాడు. దానిని కర్కాటక సంక్రమణం అంటారు. ఉత్తరాయన సమయం దేవతలకి పగలుగా భావించబడుతుంది. అందుకే పుణ్యకాలం అంటారు. ఆ కాలంలో మరణించినవారికి పునర్జన్మ వుండదని విశ్వాసం. మన సంప్రదాయం ప్రకారం గృహస్తు దేవఋణం, పితృఋణం, మనుష్యఋణం, ఋషిఋణం, భూతఋణం అనే పంచ ఋణాల నుంచి విముక్తి పొందటానికి ప్రయత్నించాలంటారు. అలా విముక్తిని పొందటానికి ఆచరించాల్సిన మార్గాలని తెలియజేస్తుంది మకర సంక్రాంతి. ఆ ఋణాలూ, వాటిని తీర్చుకునే మార్గాలూ ఏమిటంటే–

**దేవఋణం** పంటలు సమృద్ధిగా పండటానికి సూర్యుడు ముఖ్య కారకుడు. మనం త్రిమూర్తి స్వరూపుడైన సూర్యభగవానుణ్ణి సకల పోషకుడిగా, వేడివెలుతురూ, ఆరోగ్యం ప్రసాదించే దైవంగా ఆరాదిస్తాం. సంక్రాంతి పండగ నాటికి పంటలు సమృద్ధిగా పండి, రైతు చేతికి అందుతాయి. ఈ పంటల వల్లే మనిషి జీవించేది. అందుకే సంక్రాంతి నాడు తలంటు స్నానం చేసి, సూర్యాది దేవతలను పూజించి, కొత్త బియ్యంతో పొంగలి తయారుచేసి సూర్యభగవానుడికి భక్తితో కృతజ్ఞతతో నివేదిస్తారు. అలా మనకి ఆహారం ప్రసాదిస్తున్న భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేస్తాం.

**పితృఋణం** పితృఋణం తీర్చుకోవటానికి వారిని బతికి వుండగా సరిగ్గా చూడటమే కాక మరణించిన తర్వాత వారికి జరపవలసిన శ్రాద్ధకర్మలు, తర్పణాలు వగైరా సరిగ్గా చెయ్యటం ద్వారా మరణించినవారి ఋణం కొంతైనా తీరుతుందని విశ్వసిస్తారు. సంక్రాంతి రోజున పితృ దేవతలకు తర్పణలు వదలటం సంప్రదాయం.



## భూతఋణం

నీరు, భూమి, గాలి, ఆకాశం, అగ్ని వంటి పంచభూతాలు కరుణించడం వల్లనే పంటలు పండుతున్నాయి. అందుకే కృతజ్ఞతతో పంచభూతాలను కూడా పూజిస్తాం. పండిన పొలాల్లో పొంగలి మెతుకులు, పసుపు కుంకాలు చల్లి గుమ్మడి కాయను పగులకొట్టి దిష్టి తీసే ఆచారం వున్నది. పాడి పశువులు పాలిచ్చి మనల్ని పోషిస్తున్నాయి. ఎద్దులు వ్యవసాయంలో శ్రమిస్తాయి. కాబట్టే కృతజ్ఞాతా సూచకంగా 'కనుమ' నాడు పశువులను, పశుశాలను శుభ్రం చేసి అలంకరిస్తారు. వాటికి కూడా పొంగళ్ళు తినిపిస్తారు. ఇంక నెల రోజులూ ఇళ్ళ ముంగిట బియ్యం పిండితో రంగవల్లులు వేస్తారు కదా. ఆ పిండి క్రిమికీటకాదులకు ఆహారం. ఇలా మూగ జీవులకు, భూమి మొదలైన భూతాలకు కృతజ్ఞతలు తెలియజెయ్యటమే ఈ పండుగ ముఖ్యోద్దేశం.



## మనుష్య ఋణం

ఇతరుల సహాయ సహకారాలు లేనిదే సమాజంలో జీవనం సాగించలేం. అందుకు కృతజ్ఞతగా ఈ పండుగనాడు ధాన్యం, వగైరా తమ శక్తికొద్దీ దానధర్మాలు చేస్తారు. అతిథులను ఆదరిస్తారు. వ్యవసాయంలో సహాయం చేసినవారికీ, గ్రామంలోని ఇతర వృత్తులవారికీ కొత్త ధాన్యాన్ని పంచి పెట్టడం కూడా సంక్రాంతిలో మరొక ఆచారం.

## ఋషిఋణం

సంక్రాంతినాడు ఆచరించే జపాలు, ధ్యానాలు వగైరా సదాచారాల వల్లనూ, సత్ గ్రంథ పఠనం, శ్రవణం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయి. వీటి ద్వారా ఋషిఋణం కొంత తీరుతుందంటారు.పండగల ద్వారా మన జీవన విధానాన్ని పెద్దలు ఎలా తీర్చిదిద్దారో చూశారా! అంతేకాదు మకర సంక్రాంతినాడు నువ్వులపిండి ఒంటికి రాసుకుని స్నానం చేయడం కూడా ఒక ఆచారం. ఎందుకంటే మకర రాశికి శని అధిపతి. శని వాత ప్రధాన గ్రహమంటారు. వాతం తగ్గాలంటే ఈరోజు నువ్వులపిండితో స్నానం చేసి, నువ్వులు, బెల్లం, వగైరాలు తినటమే దీనికి పరిహారం. అందుకే నువ్వులు, బియ్యంపిండి, బెల్లంతో చేసిన అరిసెలు ఈ పండుగలో ప్రధాన వంటకం. సాధారణంగా పండగ అంటే ఒక రోజు, మూడు రోజులు, తొమ్మిది రోజులు అలా వుంటాయి. మరి సంక్రాంతి పండగ ఎన్ని రోజులో తెలుసా? ఇది నెల రోజుల పండగ. ఇది నెల రోజుల పండగ అన్నాను కదా! ఈ నెల రోజుల పాటు ఏం చేస్తారబ్బా అని ఆలోచిస్తున్నారా?

మీకందరికీ గుర్తుండే వుంటుంది. సంక్రాతికి, సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన రోజు నుంచీ నెల పట్టటం అంటారు. దీనినే ధనుర్మాసం అని కూడా అంటారు. ఈ ధనుర్మాసం మొదటి రోజునుంచీ, ముక్కనుమదాకా పండగ హడావిడే. నెల రోజుల ముందు నుంచీ మహిళల హడావిడి మొదలవుతుంది. తెల్లవారుఝామున చలిని కూడా లెక్క చెయ్యకుండా లేవటం, వాకిలి ఊడ్చటం.. పేడ నీళ్ళతో కళ్ళాపి జల్లటం, అది కొంచెం ఆరేదాకా ఎవరు ఏ ముగ్గు వేస్తున్నారా? అని ఇరుగు-పొరుగు అమ్మలక్కలతో ముచ్చట్లు, ఓహ్ ఎంత సందడోకదా. ఇప్పుడు ఆ ముచ్చట్లు చాలా కొద్ది చోట్లే కనబడుతున్నాయి. మేమిదివరకు అర్ధరాత్రి దాకా ముగ్గు వేసి, ఆ తర్వాత ఒక గ్రూప్‌గా వెళ్ళి రెండు మూడు వీధుల్లో వేసిన ముగ్గులు చూసొచ్చేవాళ్ళం. ఆ వీధి గ్రూపూ, ఈ వీధి గ్రూపూ మధ్యలో కలిస్తే అర్ధరాత్రి అని కూడా చూడకుండా ఎక్కడపడితే అక్కడ ముగ్గుల ముచ్చట్లే. ఈ నెల రోజులూ చుక్కలుపెట్టి ముగ్గులు వేసేవాళ్ళు కాదు, గీతలతోనే వేసేవాళ్ళు. అవీ ఆకాశంలోని గ్రహగతులనిబట్టి వుండేవి అనేవాళ్ళు. ముగ్గుల చుట్టూ వుండే బార్డర్ కూడా మూసినట్లు వేసేవాళ్ళు కాదు. వాటికి కూడా దోవ పెట్టేవాళ్ళు. స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయని. చివరి రోజు రథంముగ్గు వేసేవాళ్ళు. సంక్రాంతి సమయంలో అప్పటిదాకా పూజించిన దేవతలను సాగనంపటానికి.

## గొబ్బెమ్మలు

ముగ్గులతోనే సరిపోదు. ఈ నెల రోజులూ ఆవు పేడ సేకరించి, దానితో గొబ్బెమ్మలు చేసి, పసుపు, కుంకుమ, పూలతో వాటిని అలంకరించి రోజూ ఆ ముగ్గుల్లో పేర్చుతారు. వీటన్నింటినీ పిడకలు చేసి అవి ఎండాక దండలు గుచ్చి దొడ్లో మేకులకి తగిలించేవాళ్ళు. ఆ పిడకలతో చేసిన దాలిమీద పరవాణ్ణం వండి రథసప్తమి రోజున సూర్యుడికి నైవేద్యం పెడతారు.



ఇంకో ముచ్చట సందె గొబ్బెమ్మ. రోజూ గొబ్బెళ్ళని ఉదయంపూట పెడతారు కదా. ఈ నెలలో ఒకసారి సందె గొబ్బెమ్మ అని సాయంకాలం సమయంలో పెద్ద పెద్ద గొబ్బెమ్మలను మూడింటిని చేస్తారు. చక్కగా అలంకరించిన పీట మీద గొబ్బెమ్మలని పెట్టి ఆడపిల్లలంతా చుట్టూ రుగుతూ కృష్ణుడిమీద పాటలు పాడుతారు. ఆ గొబ్బెమ్మలు కృష్ణ భక్తిలో తరించినవాళ్ల గోపికలు. అందులో ముఖ్యురాలు గోదాదేవి. ఆవిడ పుట్టింది మార్గశిర మాసంలోనే. అందుకే ఆవిడకి ప్రతీకగా గొబ్బెళ్ళు, అప్పుడు కృష్ణుడు పాటలు... ఈ పాటలలో కృష్ణుడి మీద భక్తేకాక తెలుగువారి ఆచార వ్యవహారాలు, వ్యవసాయ పనిపాటల తీరు కూడా కనబడతాయి. ఈ ముగ్గులు సిటీల్లో కొంచెం తక్కువ కనబడతాయి. కానీ పల్లెటూళ్ళల్లో ఈ సంబరాలు వెనకపడలేదు. అందుకే ఈ పండక్కి అంతా సిటీలని వదిలి ఊళ్ళదోవ పడతారు. పోన్లెండి.. కనీసం అప్పుడైనా ఊరిని గుర్తు చేసుకుంటారు కదా!



ఈ సమయంలో పంటలు ఇంటికి వస్తాయి కదా. సమృద్ధిగా ఇంటికి వచ్చిన పంట నుంచి మనం తినటమేగాక, అందరికీ పంచటం కూడా నేర్పుతుందనుకున్నాం కదా ఈ పండగ. రైతులు పంచే ఈ ధాన్యాన్ని స్వీకరించటానికి రకరకాల వేషాలవాళ్ళు వస్తారు. ఈ సంక్రాంతి రోజుల్లో తప్పితే వేరే రోజుల్లో సాధారణంగా కనబడని హరిదాసులు, 'హరిలో రంగ హరీ' అని హరినామాన్ని గానంచేస్తూ వస్తారు. వీరి తలమీద వుండే పాత్ర గుమ్మడికాయ ఆకారంలో పైన మూత లేకుండా వుంటుంది. దానిని భూమితో కూడా పోలుస్తారు. ఆ పాత్రలో బియ్యం పోసి 'కృష్ణార్పణం' అనటం భగవంతుడు తమకి ఇచ్చిన ఫలసాయం నుంచీ కొంత భూమి రూపంలో వున్న పాత్రలో వేసి వచ్చే సంవత్సరం కూడా తమ పంటలు బాగా పండాలని కోరుకోవటం అన్నమాట. ప్రతి ఇంటివారూ హరిదాసుకు బియ్యం ఇస్తారు. వెంటనే ఆయన 'కృష్ణార్పణం' అంటూ మనం చేసే ప్రతి పనీ భగవదర్పణం చెయ్యాలని సూచిస్తాడు. ఇంకా గంగిరెద్దులవాళ్లు, బుడబుక్కలవాడు, నూనె గుడ్డలవాడు, పిట్టల దొర .. పిట్టల దొర వస్తే పిల్లలకి పండగే. అతను ఆగకుండా చెప్పే గొప్పలు వింటూ తెగ నవ్వుకునేవాళ్లం.



## గాలిపటాలు

ఈ పండగరోజుల్లో మనం చూసే ఇంకొక ముఖ్యమైన విశేషం గాలిపటాలు. ఏ డాబా మీద చూసినా పిల్లలూ, పెద్దలూ గాలిపటాలు ఎగరవేస్తూ కనిపిస్తారు. వీటికీ పోటీలు వుంటాయి. వేరేవాళ్ళ గాలి పటాలని తమ గాలిపటంతో పడగొట్టాలి. అలా పడగొట్టినప్పుడు వాళ్ళు వేసే కేకలతో వీధులన్నీ మారుమోగి పోతూంటాయి.

## భోగి

పండగ సంగతికొస్తే మొదటి రోజు భోగి. ముందు రోజే ఇంట్లో పనికిరాని చెక్క సామానంతా రోడ్డు మీదకి చేరుస్తారు. ఆకతాయి పిల్లలు చుట్టుపక్కలవారి దొడ్లల్లోంచి కూడా కర్రలు లాక్కొచ్చి చివాట్లు తింటారు. ఆ రోజు తెల్లవారుఝామునే లేచి భోగిమంటలు వేసి అందరూ వాటి చుట్టూ చలికాగుతారు. కొందరు ఆ మంటల్లోనే కాగులతో నీళ్ళు కాచుకుని తలస్నానాలు చేస్తారు.

## సంక్రాంతి

ఆంధ్రవైపు ఈ పండగకి మూడు రోజులు బొమ్మలు పెడతారు. ఈ బొమ్మల దగ్గర గౌరీదేవిని పెట్టి ఆడపిల్లలచేత పూజ చేయిస్తారు. కొందరు సంక్రమయ అని సంక్రాంతి పురుషుడు అని పెడతారు.

ఆయన ఏ వాహనం ఎక్కి వస్తాడు, ఏమి ధరిస్తాడు, ఏమి తింటు న్నాడు వగైరా వాటినిబట్టి ఆ సంవత్సర ఫలితాలుం టాయంటారు. భోగిరోజు చిన్న పిల్లలకి భోగిపళ్ళు పోస్తారు. అంటే రేగుపళ్ళు, పూల రెక్కలు, శనగలు, అక్షతలు, చిల్లర డబ్బులు వగైరాలన్నీ కలిపి దిష్టి తీసి పిల్లల తల మీద మూడు సార్లు పోస్తారు. పిల్లలకి తగిలే దృష్టి దోషాలు పోతాయని నమ్మకం.



బొమ్మలు పెట్టినవారు వీలునిబట్టి మూడు రోజులుగానీ, ఒక రోజుగానీ ముత్తయిదువులను పిలిచి నానబెట్టిన శనగలు, పండు తాంబూలం వాయనం ఇస్తారు.



## కనుమ

మూడవ రోజు కనుము. కనుమునాడు మినుము కొరకాలని ఆ రోజు చాలామంది గారెలు చేస్తారు. అలాగే కనుమునాడు కాకయినా మునుగుతుందని తప్పకుండా తలస్నానం చేస్తారు. మనవారిలో ఇంకొక నమ్మకం.. కనుమునాడు ప్రయాణం చెయ్యకూడదు అని. నాలుగో రోజు ముక్కనుమ పశువుల పండగ. తమ వ్యవసాయ పనులలో ఏడాది మొత్తం శ్రమపడి సహాయం చేసిన పశువులని అలంకరించి వాటికి ధన్య వాదాలు తెలియ జేస్తారు.



ఇంకొక విశేషం.. ఇప్పుడెవరికన్నా గుర్తుందో లేదో గానీ బొమ్మల నోము, దీనినే 'సావిత్రీ గౌరీ దేవి నోము' అంటారు. ఆ నోము ఈ పండగ ఆఖరు రోజే ప్రారంభ మవుతుంది. ఇది తొమ్మిదేళ్ళు చేస్తారు. ఆఖరి సంవత్సరం ఉద్యాపన చేసు కుంటారు. అంటే ముత్త యిదువులకి భోజనం పెట్టి, మూసి వాయనాలిస్తారు. కొందరు మహిళలు కలిసి ఒకరి ఇంట్లో ఈ నోము నోచుకుంటారు. మేళ తాళాలతో కుమ్మరి ఇంటి నుంచి బొమ్మలను తీసుకు వచ్చి ఇంట్లో ఉయ్యాల బల్లమీద వుంచి తొమ్మిది రోజులు ఉదయం, సాయంత్రం నిష్టగా పూజలు చేస్తారు. చివరికి నదిలోనో, కాలువలోనో ఆ బొమ్మలని వాలాడిస్తారు. ఇతర రాష్ట్రాల్లో సంక్రాంతి పండక్కి మన విశేషాలు చెప్పుకున్నాం. మరి ఇతర రాష్ట్రాలవారి సంగతి ఏమిటి.. తమిళనాడులో ఈ పండుగని పొంగల్ అంటారు. వాళ్ళకీ గొబ్బెమ్మలూ, ఆ పిడకలతో పొంగలి వండి సూర్యుడికి నైవేద్యం పెట్టటం వున్నాయి. భూదేవి అవతారమైన గోదాదేవి పుట్టినది మార్గశిర మాసంలో. ఆవిడ మార్గళి వ్రతమాచరించి తన పాశురాలతో రంగనాథుని మెప్పించింది. అందుకే వైష్ణవ దేవాలయాలలో ధనుర్మాసం నెలరోజులూ ఈ పాశురాలు గానం చేస్తారు. శ్రీమహావిష్ణువు అలంకారప్రియుడు, భోగ ప్రియుడు. అందుకే తెల్లవారుఝామునే అన్ని దేవాలయాలలో పూజలు జరుగుతాయి. చలికాలాన్ని తట్టుకునే శక్తినిచ్చే చక్రపొంగలి, కట్టు పొంగలి, పులిహోర, దద్ధ్యోజనం వగైరా పదార్థాలను దేవుడికి నివేదించి అందరికీ పంచుతారు. మార్గశిర మాసం నుండి పుష్యమాసం వరకు చలి చాలా ఉధృతంగా ఉంటుంది. అందువలన ఆ సమయంలో శరీరానికి పుష్టినిచ్చే ఆహారం బీదసాదలకి అందజేయటానికి మన ఋషులు, మునులు చేసిన ఏర్పాటిది. తిరుమల శ్రీవారి ఆలయంలో సైతం ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులుగా 'తిరుప్పావై' పఠిస్తారు. సహస్రనామార్చనలో తులసికి బదులు బిల్వపత్రాల తో పూజి స్తారు. అన్ని వైష్ణవ ఆలయాల్లో భోగినాడు ఆండాళ్ కళ్యాణం వైభవంగా జరుపుతారు. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, కాశ్మీర్, కేరళ, గోవా, రాష్ట్రాలలో కూడా ఈ పండగ వుంది. ఒరిస్సాలో భోగిమంటలు వేస్తారు. పంజాబ్‌లో లోహ్రి అంటారు. వాళ్ళు మిఠాయిలు, చెరకు, బియ్యం మొదలైన వాటిని భోగి మంటల్లో వేస్తారు. అంతేకాదు నేపాల్, థాయ్‌లాండ్, లావోస్, మయన్మార్, కంబోడియా దేశాల్లో సైతం ఈ పండగని వివిధ పేర్లతో చేసు కుంటారు. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క పద్ధతి. ఇన్ని విశేషాలతో, ఇన్ని రాష్ట్రాలు, దేశాలలో జరుపుకుంటున్న ఈ పండగ నిజంగా పెద్ద పండగే కదా. అయితే పండగలు ఎందుకు చేసుకోవాలో, ఎలా చేసుకోవాలో తెలుసు కుని మన ఆచార వ్యవ హారాలను కాపాడుకోవా ల్సిన బాధ్యత మనది. అందుకే పండుగ పరమార్థం తెలుసుకుని పండుగ జరుపుకోండి.



# స్ఫూర్తి ప్రదాత

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**

**"సమస్త శక్తి మీలోనే వుంది. లేవండి..మేల్కోండి..! మీ ఆశయం సిద్ధించే వరకు అవిశ్రాంతంగా పోరాడండి"** అంటూ నిద్రాణమైన బానిసత్వంలో వున్న మన దేశానికి, యువతరానికి ప్రేరణ, అనంత ఉత్సాహాన్ని, వ్యక్తిత్వపు పాఠాలను అందించి మన భారతీయ ప్రాచీన ఔన్నత్యాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు స్వామి వివేకానంద.

తల్లిదండ్రులచే నరేంద్ర నాథ్ దత్తాగా నామకరణం పొందిన వివేకానందుడు 1863 జనవరి 12న ఉదయించి 1902 జూలై 4న అస్తమించారు. 39 సంవత్సరాలు మాత్రమే జీవించిన వివేకానంద వేదాంత, యోగ, తత్వశాస్త్రాలతో పాటు వివిధ మత గ్రంథాలు, విజ్ఞాన శాస్త్రంలోని నూతన పోకడలను సైతం అధ్యయనం చేసి, శోధించి, ఆంగ్ల భాషపై అనర్గళమైన వాగ్ధాటిని సాధించి తన బోధనలతో సమాజంపై అత్యంత ప్రభావం చూపారు.

భగవంతునితో ప్రత్యక్ష అనుభవం కావాలని నిరంతరం తపించిన నరేంద్రుని జీవితంలో రామకృష్ణ పరమహంస రావడంతో ఎన్నో మలుపులు, మెరుపులు వచ్చాయి. వివేకానందుడిని కారణజన్ముడిగా భావించిన రామకృష్ణ పరమహంస తనశక్తినంత ఆయనకు ధారపోసి మనదేశాన్ని ఆకలి, అజ్ఞానం నుంచి కాపాడి యావత్ ప్రపంచానికి వేలాది సంవత్సరాల మన సంస్కృతి సాంప్రదాయాలు, విభిన్న భాషలు, విభిన్న మతాల జీవన విధానాలలోని ఏకత్వాన్ని చాటిచెప్పాలనే గురుతర బాధ్యతను వివేకానందకు ఇచ్చారు. తన గురువు ఆశయాన్ని నిలబెట్టాలనే సంకల్పం బలంగా వున్న సందర్భంలోనే తన తండ్రి చనిపోయి కుటుంబం మొత్తం పేదరికం ఆవరించింది. ఆకలిబాధలతో తల్లడిల్లింది. కుటుంబం కోసం కొన్నాళ్ల ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి తను పస్తులుండి కుటుంబ సభ్యుల ఆకలి తీర్చేవారు.

1893 సెప్టెంబర్ 11న చికాగోలో చేసిన వివేకానంద ప్రసంగం నేటికీ ప్రపంచ ప్రభావిత ఉపన్యాసాలలో మొదటి స్థానం అని చెప్పవచ్చు. మనలోని సోదరత్వపు మానవత్వానికి యావత్ ప్రపంచం సెల్యూట్ చేసింది. పురాతన సంస్కృతి కలిగిన నా హైందవ దేశం పరమత సహనాన్ని, మత సామరస్యాన్ని బోధించిందని, నదులన్నీ సముద్రంలో కలిసినట్లే విభిన్న మతాల సారాంశం మానవత్వమనే సముద్రంలో కలుస్తుందని చెప్పారు.

తన బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తించి స్వదేశానికి వచ్చాక 1897లో రామకృష్ణ మఠం స్థాపించారు. రామకృష్ణ మిషన్ ఇప్పటికీ ఎన్నో సామాజిక కార్యక్రమాలతో ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. మన దేశ సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన పుస్తకాలు, వివేకానంద, రామకృష్ణ బోధనలతో కూడిన పుస్తకాలు, జీవిత చరిత్రలు చాలా తక్కువ వెలతో అందిస్తున్నారు. కొన్ని లక్షల మందికి ఆంగ్ల భాషను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఉచితంగా నేర్పిస్తూనే వున్నారు.

వివేకానంద వారి స్ఫూర్తితో ఎంతో మంది సోదరి నివేదిత వంటి విదేశీయులు మనదేశానికి వచ్చి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా తమ ప్రాపంచిక సుఖాలను త్యజించి సన్యాసిగా జీవించారు. పేదలకు సేవ చేశారు. ఆదర్శ గురు, శిష్యులుగా పేరొందిన రామకృష్ణ, వివేకానంద స్ఫూర్తితో నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో విద్యాసంస్థలకు, సామాజిక సేవా సంఘాలకు, విద్యార్థి సంఘాలకు, శరణాలయాలకు రామకృష్ణ, వివేకానంద పేర్లు పెట్టారు. వాళ్ల విగ్రహాలను నిర్మించారు. మన భారత ప్రభుత్వం ప్రతిసంవత్సరం వివేకానంద జన్మదినమైన జనవరి 12 ను జాతీయ యువజన దినోత్సవంగా ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

సర్వమతాలలోని ఏకత్వాన్ని దర్శించండి. మానవాళికి సాయం చేయండి. ఆకలితో వున్నవాడికి వేదాంత బోధనలు ఎందుకు? పట్టెడన్నం చాలు అంటారు వివేకానంద. ఆదర్శంగల వ్యక్తి వెయ్యి తప్పులు చేస్తే, ఏ ఆదర్శం లేని వ్యక్తి యాభై వేల తప్పులు చేస్తాననడం నిస్సంశయం. కాబట్టి ఒక ఆదర్శాన్ని కలిగి వుండటం మంచిదంటూ ఉక్కు సంకల్పం, ఇనుప కండరాలు కల్గిన పదిమంది చాలు ఈ దేశ భవిష్యత్తును మార్చగలరని మనందరిపై తన




అచంచలమైన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు వివేకానంద.

నేను వివేకానంద గురించి చదివాక నాలో దేశభక్తి వెయ్యింతలు అయ్యింది అంటారు గాంధీజీ. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నా భారతజాతి ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక స్పృహ, విభిన్నతలోని ఏకత్వం వంటివి తెలుసుకోవాలంటే వివేకానంద రచనలు చదవండి అంటారు రవీంద్రనాథ్ ఠాగూర్. అందుకే నేటి భారతం వివేకానంద వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆకలి చావులు లేని అభివృద్ధి భారతంలో నిర్మాతలమై యావత్ ప్రపంచానికి మన గొప్పతనాన్ని చాటి చెబుదాం. విశ్వగురువుగా రామకృష్ణ, వివేకానంద శిష్యులుగా మన పునర్ వైభవాన్ని శతకోటి తారల తళుకుల మధ్య సగర్వంగా మన జాతీయ త్రివర్ణ పతాకపు స్ఫూర్తినందిద్దాం.

రాము కోలా

సింగిల్ పేజీ కథ

# పట్టు పరికిణీ



**కొండ ప్రాంతంలోని గోవిందాపురం నిద్రలేచే సమయం. కన్నులు నిమురుకుంటూ అందరూ లేస్తుండగా, రాధ మాత్రం నిద్రలోనే ఉంటుంది.**

పొలం గట్టున లేగదూడ మెడలోని గంటల శబ్దానికి అనుగుణంగా, రంగయ్య హరినామ సంకీర్తన పాడుతున్న శబ్దం వినిపిస్తుంది. ఊరిలోకి వస్తున్న గుర్రపు బండి చప్పుళ్లు, పీచు మిఠాయి బండి వాడి అరుపులు, పిల్లల హడావుడి అన్నీ కలిసి గోవిందాపురం చిత్రాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతున్నాయి.

ఊరికి నడిబొడ్డున ఒక చిన్న ఇంటి ముందు అమాయకత్వం నిండిన చిన్న పిల్ల ఆడుకుంటోంది. తన పేరు రాధ.

ఆమె చేతిలో పట్టు పరికిణీ. బామ్మగారిని ఒప్పించి పట్నంలో తనకు నచ్చిన రంగులో కొనిపించుకున్న పరికిణీ అది. తన చుట్టూ చుట్టుకుని అటూ ఇటూ తిరుగుతూనే ఆనందిస్తోంది రాధ. పరికిణీ చూసి మురిసిపోతోంది. ఆనందంగా నవ్వుతోంది.

పరికిణీని గట్టిగా పట్టుకుని పరుగులు తీస్తుంది. పరికిణీ అంచుల్లో ఒదిగిన అద్దాలతో మెరిసిపోతున్న సూర్యకాంతిలో ఇంద్రధనస్సు లా మెరిసింది. అందులో తన ముఖం చూసి నవ్వుకుంది. ఆ నవ్వు గ్రామమంతటా వినిపించింది. గ్రామంలో పండగ సందడి మొదలైంది. అందరూ కొత్త బట్టలు వేసుకుని, దైవానికి తమ కోర్కెలు విన్నవిం చుకునేందుకు గుడికి వెళ్తున్నారు. అందులో రాధ కూడా ఉంది. అందరికీ తన పరికిణీ చూపిస్తూ, నాన్నమ్మ చేతులు పట్టుకుని ముందుకు సాగిపోతుంది. పగలంతా, పరికిణీని చూపిస్తూ అందరితో సరదాగా గడిపేసిన రాధ అలసి సోలసి నిద్రలోకి జారుకుంది. కలలో తన పరికిణీతో ఇంద్రధనస్సుపై కూర్చుని తన నాన్నమ్మతో కబుర్లు చెప్పుకుంటూ, చందమామకు తన పరికిణీ చూపిస్తూ కవ్విస్తుంది.

కలలో నుండి మేల్కొన్న రాధకు, తన చేతిలోని పరికిణీ సాధారణంగానే కనిపిస్తుంది. కానీ, ఆమె మనసులో మాత్రం, ఆ పరికిణీ ఒక అపురూపమైన వస్తువుగానే ఉంది.

కాలంతో పాటు రాధ ఎదిగింది. ఆమె మనసులో పరికిణీ ఒక మధురమైన జ్ఞాపకాన్ని మిగిల్చింది. నేటికీ తన గదిలో పరికిణీ కోసం కొంత స్థలాన్ని కేటాయించే అంత మక్కువను పెంచుకుంది. నాన్నమ్మ జ్ఞాపకాలను పరికిణీతో ముడివేస్తూ, రాధ చిన్నప్పటి నుండి చదువుల్లో మేటి. పాఠశాలలో ఎల్లప్పుడూ తొలి స్థానం సాధించేది. కేవలం చదువు మాత్రమే కాదు, ఆటల్లోనూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేది. వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ.. ఇలా ఏ ఆట అయినా ఆడటానికి ఆమె ఎప్పుడూ సిద్ధంగా ఉండేది.

రాధకు పెద్దల పట్ల గౌరవం అధికం. తన కంటే వయసులో పెద్దవారిని గౌరవిస్తూ అందరి ఆశీస్సులు అందుకుంటుంది.

ఎల్లప్పుడూ పెద్దల మాట వినడానికి సిద్ధంగా ఉంటుంది. పెద్దలను ఎలా గౌరవించాలో అనేక పర్యాయాలు నాన్నమ్మ నుండి అడిగి తెలుసుకుంది. పెద్దల అనుభవాలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి అని నమ్ముతుంది. తన కుటుంబం నుండి తాను నేర్చుకున్నది తన తోటివారికి వివరిస్తుంది. పెద్దయ్యాక రాధ తన చదువును కొనసాగిస్తూనే, సమాజ సేవలోనూ చురుగ్గా పాల్గొనేది. గ్రామాల్లోని పిల్లలకు చదువు చెప్పడం, పేదలకు సహాయం చేయడం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొనేది. తనలోని నాయకత్వ లక్షణాలను గుర్తించిన రాధ, జిల్లా కలెక్టర్‌గా ఉండాలనే తీర్మానం చేసుకుంది. కష్టపడి చదివి, ప్రభుత్వ పరీక్షల్లో ఉత్తీర్ణురాలై రాధ తన కలను సాకారం చేసుకుంది. ఒక జిల్లాకు కలెక్టర్‌గా నియమితురాలైంది. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా తనలోని ఆట స్ఫూర్తిని మరచిపోలేదు.

జిల్లాలోని విద్యార్థులలో క్రీడలపై ఆసక్తి పెంచడానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. ప్రతి శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ వద్ద క్రీడా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలతో కలిసి ఆడేది. తన స్నేహితులతో కలిసి గ్రామంలో చిన్నపాటి గ్రంథాలయం ఏర్పాటు చేసింది.

పోటీ పరీక్షలకు కావాల్సిన ఎన్నో పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం, నీరు ఆదా చేయడం లాంటివి చేసి వాళ్ల గ్రామాన్ని పచ్చగా ఉంచేందుకు తన వంతు కృషి చేసింది.

ఒక మనిషి ఏదైనా సాధించవచ్చు. కష్టపడితే అసాధ్యం అనేది ఏదీ ఉండదనీ, విద్య వినయంతో పాటు బాధ్యతలను నేర్పుతుందని రాధ తన జీవితానుభవంతో నిరూపించింది. ◆


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్
పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# వాల్ చూపులు

కలువ కన్నులలో కళ
పండు వెన్నెల వేల
కళ్లు తెరిచిన కలువ బాల
రే రాజు చెలిమి ఆనందహేళి!

కొమ్మ రాలుతున్న పువ్వు
కొమ్మ మురిపాల నవ్వు
కొమ్మ కొమ్మకు దవ్వు
కొమ్మకు కొమ్మ దండాల నవ్వు!

కార్తికం పండు వెన్నెలకు
కారు మేఘం అడ్డు కాదు
వెన్నెల్లో సిగ్గుపడే బుగ్గలకు
దోబూసుల
పరదాలు!

నింగి విడిచి
నీవొస్తే
నింగి తారలు
చిన్నబోవా
నీ చిలిపి చేష్టలు
జూసి
నిందించరా
జనుల్ రే రాజా!

నింగిలో నీవుంటే
జగతికి వెండి వెన్నెల అందం
నేలపై నేనుంటే
ఎదురు చూపులకందం!



సొగసరి సిగ్గుల సోయగాలకు
ఊహల గాలమేస్తాయి
తెరచాటు
గడసరి వాల్ చూపులు!

**- పి.బక్కారెడ్డి**

# కాగితం పడవల పండగ




వినువీధి నుండి వాన పడుడే ఆలస్యం
వీధి కాలువలన్నీ బాలలు చేసిన
కాగితం పడవలతో కోలాహలం.

అమ్మ నాన్నలు అరుస్తున్నారు
పిల్లలు కాగితాలు ఖరాబు చేస్తున్నారని.
తాతలకు అమ్మమ్మలకు నాన్నమ్మలకు ఆనందమే
తమ బాల్యానందం బాలలలో చూస్తున్నామని.


పైన వాన మబ్బులు
కింద కాగితం పడవలు.
పైన ఉరుములు
కింద పిల్లల అరుపులు.

పైన మబ్బులు తేలిపోతున్నాయి
కింద కాగితం పడవలు కాలువలో తేలిపోతున్నాయి.

కాగితం పడవలే
నీట పడగానే ప్రాణం వచ్చినట్లే పరుగులే పరుగులు
బాలల ప్రత్యేక పండగ
కాగితం పడవల పండగ.

**- కందాళై రాఘవాచార్య**

# అతడు



అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ
అతడు నన్ను పలకరిస్తూనే ఉంటాడు.

అకారణంగా నేను పలకరించకపోయినా
నాలో తప్పక పొలమారుతూ ఉంటాడు.

అప్పుడప్పుడూ కరిగిపోయిన జ్ఞాపకాలను
నాకు కొన్ని గుర్తు చేస్తూ ఉంటాడు.

సంవత్సరం మొదట్లోనో చివర్లోనో
మరికొన్ని జ్ఞాపకాలను మోసుకొస్తూ
నిశీధిలో కూడా వెన్నెల కురిపిస్తూ ఉంటాడు.

ఏ బంధం లేకపోయినా అనుబంధాల మాటున
స్నేహమై మదిలో నదిలా నిత్యం ప్రవహిస్తూ ఉంటాడు.

**- చిత్రాడ కిశోర్ కుమార్**

# లోకం ఒక్కటే

లోకం ఒక్కటే
యోగికి ఒకలా
భోగికి ఒకలా
కనబడుతోంది...అంతే..!
మనం చూసే చూపు బట్టి
మనం చేసే పని బట్టి
మనం నిర్వర్తించే క్రియా బట్టి
మనం ఆలోచన బట్టి
మనం నడిచే విధానం బట్టి
మన బతుకుబండి సాగే పద్ధతి బట్టి
మారుతూ ఉంటుంది
లోకం ఒక్కటే
దేహం ఒక్కటే

**- డాక్టర్ పగిడిపల్లి సురేందరు**

13:13.qxd 1/7/2025 2:56 PM Page 1

# సంక్రాంతి రుచులు

**సంక్రాంతికి ముంగిట్లో ముగ్గులు అందరూ వేస్తారు. కానీ మీరు మాత్రం కాస్త ప్రత్యేకంగా నూనెలో అందమైన మెలికల ముగ్గులు వేసుకోవాలను కుంటున్నారా? అయితే ఈ రక రకాల పిండి వంటలను వెంటనే ప్రయత్నించి రుచులను ఆస్వాదించండి మరి.**

## అరిసెలు



**కావలసినవి :** .బియ్యం 1 కిలో, బెల్లం: 1 కిలో, నువ్వులు 100 గ్రా, నెయ్యి తగినంత, నూనె సరిపడ

**తయారీ :** బియ్యాన్ని రాత్రంతా వీలయితే ఒక రోజంతా నానబెట్టాలి.
✦ బియ్యం పిండిని ఇంట్లో కాకుండా మిల్లులో మర పట్టించడం మంచిది. పిండి బాగా నలిగి అరిసెలు మృదువుగా వస్తాయి. ✦ ఎప్పుడూ అవసరమైన దానికన్నా ఎక్కువ పిండిని ఉంచుకోవాలి. ఒకవేళ బెల్లం పాకం ఎక్కువ అనుకోకుండా కాస్త ఎక్కువైతే బియ్యం పిండి వేసి సరిచేయవచ్చు.
✦ బెల్లం పాకం చేసేటప్పుడు బెల్లం తురుములో నీళ్ళు చాలా కొద్దిగా మాత్రమే పోయాలి. ఎక్కువగా పోస్తే పాకం పల్చగా అయ్యి అదంతా ఆవిరి అయ్యేవరకు కలుపుతూనే ఉండాల్సి వస్తుంది. ✦ అరిసెల పిండి చపాతీ పిండిలా గట్టిగా అయ్యేవరకు బెల్లం పాకంలో బియ్యం పిండి వేసి కలుపుతూ ఉండాలి. ఒకవేళ పిండి కాస్త పలుచగా కానీ జారుగా కానీ ఉన్నా అరిసెలు విపరీతంగా నూనె పీలుస్తాయి. అంతే కాకుండా అరిసెలు వేయించాక గట్టిగా అవుతాయి. అందుకే పిండిలో ఎక్కువ తేమ లేకుండా చూసుకోవాలి. ✦ మీడియం సిమ్ మీద ఉడికించడం వల్ల పై భాగమే కాకుండా లోపల కూడా చక్కగా ఉడుకుతుంది.
✦ బెల్లం పాకంలో నెయ్యిగానీ నూనెగానీ వేసి చేస్తే, అరిసెల పిండి కలిపాక ఆ నెయ్యి పిండిని అన్ని అరిసెలను వేయించేలోపు పొడిబారకుండా కాపాడుతుంది. అంతే కాకుండా పిండిలో కలిపి ఉన్న నెయ్యి వేయించేటప్పుడు బయటి నుండి వచ్చే నూనెను పీల్చనివ్వకుండా చేస్తుంది. ✦ చివరి చిట్కా: అరిసెలను నూనె లోకి జార విడిచేటప్పుడు, తిప్పేటప్పుడు ఇంకా వేయించాక నూనె పిండేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. పొరబాటున నూనె మీద చిందే అవకాశం ఉంది. ఈ అరిసెలను రెండు వారాల వరకు నిలవ చేసుకోవచ్చు.

విందు-వసందు

## చకిలాలు



**కావాల్సిన పదార్థాలు..** .తెల్ల నువ్వులు కొన్ని ..పచ్చిమిర్చి కారం కొద్దిగా, ఉప్పు రుచికి సరిపడా ..వాము కొద్దిగా.

**తయారీ:** ముందుగా బియ్యం తీసుకుని సరిపడే నీటిలో నానబెట్టాలి. ఆ తడి బియ్యంను పిండి పట్టించాలి. కేజీ పాత బియ్యం ఒకరోజు మొత్తం నానబెట్టి, ఆ బియ్యాన్ని ఆరబెట్టిన తరువాత పిండి ఆడించాలి. పిండిని కాస్త తడి ఆరేదాకా ఎండలో పెట్టాలి. ఒక కిలో పిండికి కొలతల ప్రకారం 100 గ్రాముల నువ్వులు, వాము 10 గ్రాములు, నువ్వులు రుచికి సరిపడా ఉప్పు వేసి మొత్తం కలపాలి. ఇలా తయారైన పిండిలో కొద్ది కొద్దిగా నీళ్ల పోసుకొని కలుపుకుంటూ ఉండాలి. మరీ గట్టిగా కాకుండా మరీ పలచగా కాకుండా చేసుకోవాలి. అలా కలిపినా దానిని ఒక పదిహేను నిమిషాల పాటు మూత పెట్టి ఉంచాలి. తర్వాత దానిని ఏదైనా కాటన్ వస్త్రంలో కట్టి పిండితో గుండ్రంగా చుట్టాలి. మొత్తం సకినాల ఆకారం వచ్చేదాక చుట్టాలి. వాటిని మరుగుతున్న నూనెలో వేసి గోలించుకోవాలి. రుచికరమైన సకినాలు రెడీ అయిపోతాయి. మీకు ఏ రకమైన ఆకారం కావాలని అనుకుంటారో ఆ ఆకారంలో చేసుకోవచ్చు.

## నువ్వుల లడ్డు



**కావాల్సిన పదార్థాలు:** నువ్వులు 1 కప్పు, బెల్లం 1 కప్పు, నెయ్యి.

**తయారీ విధానం:** ముందుగా ఒక కడాయిలో ఒక కప్పు నువ్వులు వేసుకొని సన్నని సెగపై నువ్వులు చిటపటమన్నంత వరకు వేయించుకోవాలి. నువ్వులు వేగి కొద్దిగా రంగు మారిన తరువాత స్టవ్ ఆఫ్ చేసి చల్లారనివ్వాలి. ఒక మిక్సీ జార్‌లో చల్లారిన నువ్వులు వేసి గ్రైండ్ చేసుకొని, అందులో ఒక కప్పు బెల్లం వేసుకొని మళ్లీ గ్రైండ్ చెయ్యండి. నువ్వుల్లో ఆయిల్ రిలీజ్ అవుతుంది. ఒక ప్లేట్‌లోకి తీసుకోని లడ్డు సైజులో ఉండలు కట్టుకోవాలి. ఎంతో ఆరోగ్యకరమైన బెల్లం నువ్వుల ఉండలు రెడీ.

ఈ నువ్వుల లడ్డుని రోజుకి ఒకటి చొప్పున తింటే ఎంతో ఆరోగ్యం.

## జంతికలు



**కావాల్సినవి:** బియ్యప్పిండి రెండు కప్పులు, సెనగపిండి ముప్పావు కప్పు, వెన్న పావు కప్పు, వాము, నువ్వులు రెండు టీ స్పూన్లు, పసుపు అర టీస్పూన్, ఉప్పు తగినంత, కారం టీస్పూన్, గరంమసాలా పొడి టీస్పూన్, చాట్మసాలా పొడి అర టీ స్పూన్. **తయారీ:** వెడల్పాటి పాత్రలో బియ్యప్పిండి, సెనగపిండి మిగిలిన పదార్థాలన్నీ వేసుకోవాలి. కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పిండిని ముద్దలా కలపాలి. జంతికల గొట్టంలో కొద్దిగా నూనె రాసి కొంచెం మిశ్రమాన్ని పెట్టాలి. కడాయిలో నూనె పోసి మరిగించి జంతికలు వేయాలి. మధ్యస్థంగా ఉండే మంట మీద రెండు వైపులా వేయించి తీయాలి. ■

# ప్రాచీన జలపాతాలు

షేక్ అబ్దుల్ హకీం జాని



గాయత్రి జలపాతం

తెలంగాణలో అనేక జలపాతాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటిని తిలకించడానికి అనేక ప్రాంతాల నుండి పర్యాటకులు అనునిత్యం వస్తూ ఉంటారు. వీటిలో కొన్ని అతి ప్రాచీనమైన జలపాతాలు కూడా ఉన్నాయి.

### గాయత్రి జలపాతాలు

నిర్మల్ పట్టణం చుట్టూ ఉన్న అనేక జలపాతాల్లో గాయత్రి జలపాతం ఒకటి. ఈ గాయత్రి జలపాతాలు అదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండలంలో ఉన్నాయి. ఈ జలపాతం తెలంగాణ లోనే అతి ఎత్తైనా జలపాతం. దీని ఎత్తు 363 అడుగుల ఎత్తు ఉంటుంది. ఎత్తు నుంచి కిందకు జాలువారుతున్న ఈ జలపాతాల అందాలు తిలకించిన వారికి మనోల్లాసం కలుగుతుంది. దీన్ని ముక్తిగుండం జలపాతం అని కూడా పిలుస్తారు. ఎంతో సహజసిద్ధంగా ఏర్పడిన వాగులు, కొండకోనల్లో నుంచి బజార్ హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాల అటవీ ప్రాంతాల గుట్టలపై నుంచి ప్రవహిస్తున్న నీరు గాయత్రి పేరుతో రాతి శిలలపై నుంచి పారుతోంది. జలపాత నీటి బిందువులు శీతాకాలంలో హిమచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్ లో పడే మంచుబిందువులను తలపిస్తుంటాయి.



బొగత జలపాతం

### బొగత జలపాతం

ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి వెంకటాపురం మండలంలోని పామునూరు దగ్గరున్న పెద్దవాగు వాజేడు మండలంలోని చీకుపల్లి గ్రామం మీదుగా ప్రవహిస్తుంది. ములుగు జిల్లాలోని వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో బోగత గ్రామంలో ఈ జలపాతం ఉంది. ఈ జలపాతం చూడ్డానికి భద్రాచలం, వరంగల్ నుంచి చేరుకోవచ్చు. వరంగల్ నుంచి 132 కిలోమీటర్ల దూరం, భద్రాచలం నుంచి 127 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీన్ని తెలంగాణ నయాగర అని పిలుచుకుంటారు. చీకుపల్లి వాగు నీరే బొగత దగ్గర దాదాపు 50 అడుగుల ఎత్తయిన కొండల నుంచి కిందకు దూకుతుంది. 200 అడుగుల వెడల్పుతో మంత్రముగ్ధుల్ని చేసే ఈ జలపాతం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మరింత ఉదృతంగా ప్రవహిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జలపాతంగా ఇది ప్రసిద్ధి చెందింది. ప్రకృతిని ఆస్వాదిస్తూ పాల నురగల నీటిధారల్ని కళ్ల విప్పార్చుకుని చూస్తూ పచ్చటి చెట్ల నడుమ విహరించాలనుకుంటే బొగత జలపాతానికి వెళ్లాల్సిందే. ఈ జలపాతం సమీపంలో కొంగల జలపాతం, గద్దల జలపాతం, ఒంటిమామిడి లొద్ది జలపాతం ఉన్నాయి.

### కుంటాల జలపాతం

ఆదిలాబాద్ జిల్లాలో ఇది ప్రముఖ పర్యటక కేంద్రంగా విరాజిల్లుతోంది. కుంటాల తెలంగాణలోని ఎత్తయిన జలపాతాల్లో ఒకటి, సహ్యాద్రి పర్వత శ్రేణిలో గోదావరికి ఉపనది అయిన కడెం నదిపై ఈ జలపాతం ఉంది. వర్షాకాలంలో పర్యాటకులు రెక్కలు కట్టుకుని ఇక్కడ వాలిపోతుంటారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి దాదాపు అరవై కి.మీ. దూరంలో నేరడిగొండ మం॥ కుంటాల గ్రామ సమీపంలో కడెం నదిపైన అడవిలో ఉంది. ఎత్తయిన రాతి శిలల మీదుగా రెండు పాయలుగా విడిపోయే ఈ జలపాతపు మొదటి పాయ సమీపం వరకు పర్యాటకులు పోతుంటారు. ఇక్కడే సోమన్న దేవుడి రాతిగుహ కూడా ఉంది. ఇక్కడ జరిపే సోమన్న జాతరకు దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ ప్రదేశంలో మూడు జలపాతాలతో పాటు కొన్ని గుండాలు ఉన్నాయి. వీటిలో సోమన్న గుండం ముఖ్యమైంది. పచ్చటి చెట్ల మధ్యలోని కుంటాలకు చేరుకోవడానికి 400కిపైగా మెట్లతో ఉండే దారి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.



కుంటాల జలపాతం







## భీమునిపాదం జలపాతం

మహబూబాబాద్ జిల్లాలో పర్యాటక ప్రాంతాల్లో భీమునిపాదం జలపాతం ప్రముఖమైంది. ఇది నరసింహులపేట మండలం కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో పచ్చని ప్రకృతి మధ్య నెలకొని ఉంది. ఏడాది పొడవునా కనువిందు చేసే ఈ జలపాతం వర్షాకాలంలో మరింత వేగంగా పరవళ్లు తొక్కుతుంది.

## పొచ్చర జలపాతం

పొచ్చర జలపాతం ఆదిలాబాదు జిల్లా బోథ్ మండలానికి వెళ్ళే మార్గంలో జాతీయ రహదారికి 6 కి.మీ. దూరంలో పొచ్చర గ్రామ సమీపంలో నెలకొని ఉంది. చిన్న చిన్న కొండ రాళ్ళ నుంచి ఇరవై మీటర్ల ఎత్తు నుండి కిందకు నీరు దుముకుతూ, చిన్న పాయలుగా ప్రవహిస్తూ కనువిందు చేస్తుంది.ఇతర జలపాతాలకన్నా ఇది భిన్నంగా ఉండటం వల్ల తరచూ ఇక్కడ సినిమా షూటింగులు జరుగుతుంటాయి.

## కనకాయ్ జలపాతం

కనకాయ్ జలపాతాన్ని కనకదుర్గ జలపాతం అని కూడా అంటారు. కుంటాలకు 35 కిలోమీటర్ల దూరంలో గిర్నూర్ సమీపంలో ఈ జలపాతం ఉంది. ఇది మూడు జలపాతాల సముదాయంగా ఉంటుంది. ఒకదానిని కనకాయ్ జలపాతం, రెండో దానిని బంగ్రేవు జలపాతం, మూడో దానిని చీకటిగుండం అని పిలుస్తారు. వందల అడుగుల ఎత్తున కొండల వరుస శిఖరాగ్రాల మధ్య భాగం నుంచి సూటిగా నింగి నుంచి నేలకు దుముకుతూ కనిపించేసుందర దృశ్యం నయనానందకరంగా ఉంటుంది.




## రాయికల్ జలపాతం

రాయికల్ జలపాతం కరీంనగర్ జిల్లా సైదాపురం మండలంలోని రాయికల్ అనే గ్రామానికి సమీపంలో ఉంది. వరంగల్ అర్బన్ కరీంనగర్ జిల్లాల సరిహద్దుల్లో సైదాపురం దట్టమైన పచ్చని అటవీ ప్రాంతంలోని కొండకోనల నుంచి హోరెత్తే నీటి హోయలుతో నిండిన జలపాతం ఇది. 170 అడుగుల ఎత్తులో నుండి కిందికి దూకుతున్న ఈ జలపాతం పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు కనులవిందును కలిగిస్తుంది.

## అజిలాపూర్ జలపాతం

తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లా కేంద్రానికి మర్రిగూడ మండలంలోని అజిలాపూర్ గ్రామం ఉంది. జిల్లా కేంద్రం నుంచి అజిలాపూర్ గ్రామానికి వాహన సౌకర్యం ఉంది. అజిలాపూర్ గ్రామం నుంచి రెండు కి. మీ. దూరాన రాచకొండ గుట్టలకు ఆనుకొని సహజ సిద్ధంగా అజిలాపూర్ జలపాతం ఏర్పడింది. దీన్ని బుగ్గ జలపాతం అంటారు. ఈ ప్రాంతాన్ని నల్లగొండ అరకు వ్యాలీ అని పిలుస్తారు. చుట్టూరా కొండలు, గుట్టలతో పాటు పచ్చనిచెట్లు ఎంతో ఆహ్లాదాన్ని పంచి పెడతాయి. చల్లటి, ప్రశాంతమైన వాతావరణంలో బండరాళ్లపై నుండి జారిపడుతున్న ఆ నీటి సవ్వడి పర్యాటకులకు ఆనందాన్ని కలిగిస్తుంది.

## కొంగల జలపాతం

ములుగు జిల్లా వాజేడు మండలంలోని కొంగల గ్రామంలో ఈ జలపాతం నెలకొని ఉంది. హైదరాబాద్ నగరానికి 275 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ జలపాతానికి వెళ్ళడానికి దట్టమైన అడవి గుండా కాలినడకన (రోడ్డు నుంచి 1.5 కి.మీ.), పొలాలు, రెండు వాగులు, గుట్టలు దాటుకుంటూ వెళ్ళాలి.

## గుండాల బాహుబలి జలపాతం

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని గుండాల గ్రామం సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ 125 అడుగుల ఎత్తు నుండి నీరు జాలువారుతూ సుందరంగా కనిపిస్తుంది. నిజామాబాదు జిల్లాలోని ధరపల్లి మండలం లోని సిర్నాపల్లి గ్రామంలో సిర్నాపల్లి జలపాతం ఉంది. మహబూబ్ నగర్ జిల్లా అమ్రాబాద్ మండలంలో విస్తరించి ఉన్న దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో మల్లెల తీర్థం జలపాతం ఉంది. ములుగు జిల్లా, వెంకటాపురం మండలంలోని వీరభద్రారం గ్రామానికి సమీపంలో గద్దలసరి జలపాతం ఉంది. ఆకాశంలో గద్దలు ఎగిరేంత ఎత్తున ఉండటంతో స్థానిక గిరిజనులు దీనిని గద్దలసరి జలపాతం అని, ముత్యాల్లా మెరిసిపోతుండ డంవల్ల ముత్యాల జలపాతమని పిలుస్తున్నారు. మనదేశంలో ఎత్తైన జలపాతాలలో ఇది ఒకటి అని తెలుస్తుంది. కొమరంభీం జిల్లా లింగాపూర్ మండలంలోని పిట్టగూడకు రెండు కిలో మీటర్ల దూరంలో అడవుల్లో సప్తగుండాల జలపాతం ఉంది. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని ఖండాల గ్రామ పంచాయితీలో మొలాల్ గట్టు జలపాతం జలజలా జాలువారుతూ అందరి హృదయాలను పరవశింపజేస్తుంది. ◆



# సింహానికి మనశ్శాంతి

కథ

ఒక అడవిలో సింహం వేటాడి వదిలేసిన జంతు కళేబరాలను తినడానికి రాబందులు రావడం, సింహాన్ని చూసి కొన్ని జంతువులు భయపడి పరుగెత్తడం.. మొదలైన సంఘటనలు కొంత కాలానికి ఆ సింహానికి విసుగు కలిగించాయి. తను హాయిగా ఉండాలంటే ఏం చేయాలో దానికి తెలియలేదు. ఒకరోజు సింహం తన గుహలో నుండి బయటకు వచ్చింది. ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. చెట్టు మీద కోకిల పాట పాడుతోంది. మరో కొమ్మ మీద అందాల రామచిలుక పండు కొరుకుతూ ఎంతో ఆనందాన్ని పంచుతోంది.



"ఇప్పుడు నాకు ఎంతో ఆనందంగా ఉంది. రోజూ ఇలాగే ఉంటే బాగుంటుంది కదా!" అనుకుంది సింహం. అలా అనుకొంటుండగానే గుహ దరిదాపుల్లోనే ఒక చుక్కల జింక గడ్డి మేస్తూ కనబడింది. సింహం దానిని తినాలనుకుంది. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని జింక రక్తంతో పాడు చేస్తే బాగుండదని గుహ బయట కూర్చుని ప్రకృతిని ఆస్వాదించసాగింది! చెట్టుమీద నుండి గమనిస్తున్న కోకిల, కాకి, చిలుక సింహం జింకను తినకుండా కూర్చుని ఉండటం చూచి ఆశ్చర్యపోయాయి!

"సింహం జింకను వేటాడటం లేదు?" అని కాకి అడిగింది. చిలుక ఆలోచించి "ఈ రోజు సింహం ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆనందం పొందుతోంది. ఈ వాతావరణంలో ఆ అమాయక జింకను చంపదలచుకొన్నట్లులేదు!" అని వివరించింది.

"నిజమే! ఈ మంచి వాతావరణం నాలో ఉత్తేజం కలిగిస్తోంది. ఈ ప్రకృతిలో నాకు పాట పాడాలని ఉంది అంటూ కోకిల మంచి రాగం అందుకుని పాడుతూ అందరికీ ఎంతో ఆనందం కలిగించసాగింది. ఆ పాటవల్ల రామచిలుకకు పండు మరింత రుచిగా అనిపించసాగింది. అలా చెట్టు కింద కుందేళ్ళు, జింకలు మొదలైన చిన్న జంతువులు కోకిల పాటను, పచ్చని ప్రకృతిని ఆస్వాదించసాగాయి! దూరంగా మార్కండేయ ముని తన శిష్యుడు సుహాస్తుడిని వెంటబెట్టుకుని కొన్ని పువ్వులు, యాగానికి కావలసిన ఎండు కట్టెలు తీసుకపోవడానికి వచ్చాడు.

ఆయనకు అడవి అంటే భయం లేదు. ఆయన కూడా ఆ ప్రకృతికి పరవశించి కొంతసేపు అక్కడే ఆగిపోయి కోకిల పాటను వింటుంటే ఆ పాట మరింత శ్రావ్యంగా వినబడసాగింది. శిష్యుడు గురువుగారు ఆగిపోయి కోకిల పాటను వింటూ ఆనందం పొందుతున్నట్లు గమనించి ఆశ్చర్యపోయాడు.

శిష్యుడిని గమనించిన ముని "చూడు సహస్తా! ఈ ప్రకృతిని వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. చుట్టూ మంచి వాతావరణం, కోకిల పాట, మంచి పూలచెట్లు అన్నింటినీ చూస్తూ ఆస్వాదిస్తుంటే ఎంతో హాయిగా ఉందికదా! ఆ విధంగానే మనం మంచిని పంచే మనుషులమధ్య సత్సంగాలలో ఉంటే మనకు ఎన్నో మంచి విషయాలు తెలుస్తాయి. మనస్సు చైతన్యం చెందటమే కాకుండా ఎంతో ఆనందంగా ఉంటుంది! ప్రతివారినీ విమర్శిస్తూ ఉండేవారి మధ్య ఉంటే మన మెదడు చెడుతుంది. మనకు చిరాకు పుడుతుంది తెలిసిందా సుహస్తా?" అని వివరించాడు ముని. "ఈ రోజు ఈ ప్రకృతి నుండి మంచి పాఠం నేర్చుకున్నాను గురువర్యా! మీకు అనేక నమస్కృతులు" ఆనందంతో చెప్పాడు సుహాస్తుడు. మనం కూడా మంచివారి మధ్య ఉండాలి, మంచిగా ఆలోచించాలి. అప్పుడు అంతా ఆనందమే కదా!" అన్నాడు గురువు.

**- కంచనపల్లి వేంకట కృష్ణారావు,** హైదరాబాద్





## బాలగేయం

### సంక్రాంతి సంబరం



సంక్రాంతి సంబరం
తాకింది అంబరం
ముత్యాల ముగ్గులో
గొబ్బెమ్మల సింగారం!
భోగి మంటల వెచ్చదనం

పాడిపంటల పచ్చదనం
ధాన్యపు రాశుల
ఆనందం
పిండివంటల కమ్మదనం!

కొత్త బట్టల సోయగం
హరిదాసుల కీర్తనం
గంగిరెద్దుల నర్తనం
చుట్టరికపు ఆత్మీయం!

ఇల్లంతా కోలాహలం
ఊరంతా ఉత్సాహం
పైపైకెగిరే గాలిపటం
సూర్య మకర
సంక్రమణం!

సంక్రాంతి పర్వదినం
యేటేటా ముమ్మరం
సరదాల కోడిపందెం
మాకెంతో సంబరం!

**-ఆవులచక్రపాణియాదవ్,**
కర్నూలు

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.పుష్ప,** కావలి

**ప్రశ్న: మొక్కల ఆకులు ఆకుపచ్చగా ఉన్నప్పటికీ వాటికి వాటి పూలు రంగులలో వుండడానికి కారణం ఏమిటి?**

**జవాబు:** పత్రహరితం(క్లోరోఫిన్) వుండటం వల్ల ఆకులు ఆకుపచ్చగా ఉంటాయి. ఆకుకు ఆహార పదార్థాలను కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారు చేయడానికి ఆకులోని ఆకుపచ్చ రంగును ఏమాత్రం ఉపయోగించుకోదు. సూర్యకాంతిని గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్, మొక్క వేళ్ల ద్వారా ఆకుల్లోకి చేరిన నీటి ఆవిరిని మేళవించడం ద్వారానే కిరణజన్య సంయోగ క్రియ జరుగుతుంది. ఈ ప్రక్రియ ద్వారా మొక్కకు అవసరమైన ఆహారం రూపొందుతుంది. మొక్కకు కలిగిన పువ్వులు మాత్రం ఈ ప్రక్రియలో పాల్గొనవు. మొగ్గగా ఉన్నప్పుడే పువ్వు రేకలలో రకరకాల రంగులు (పిగ్మెంట్స్ రూపంలో) ఉండటంతో ఆయా మొక్కలను అనుసరించి వివిధ రూపాల్లో, రంగులలో మొగ్గలు పువ్వుల రూపాన్ని సంతరించుకుంటాయి.

**- కె.ఆశిష్,** ఖమ్మం

**ప్రశ్న: పవనం అంటే ఏమిటి?**

**జవాబు:** భూమి ఉపరితలం మీద క్షితిజ సమాంతరంగా చలించే వాయువును పవనం అంటారు. ఊర్ధ్వ, అధోవాయు చలనాన్ని వాయు ప్రవాహం అంటారు. గాలి వేగాన్ని తెలియజేసేది పవన వేగమాపకం. గాలి వీచే దిశను తెలుసుకునేందుకు పవన సూచికను ఉపయోగిస్తారు. పవనాలు ప్రపంచ పవనాలు, ఋతుపవనాలు, స్థానిక పవనాలు అని మూడు రకాలు. స్థిరంగా ఒక దిశలో అధిక పీడన ప్రాంతాల నుంచి అల్పపీడన ప్రాంతాలకు వీచేవి ప్రపంచ పవనాలు. ఇవి వ్యాపార, పశ్చిమ, ధృవ పవనాలని మూడు రకాలు. ఒక నిర్ణీత కాలంలో వీచే పవనాలను ఋతుపవనాలని అంటారు. కొన్ని ప్రాంతాలకు పరిమితమైనవాటిని స్థానిక పవనాలు అని అంటారు.

# ఆధునిక యుగంలో ఆదర్శ గ్రామం

**అదో కుగ్రామం... అక్కడ విద్యుత్ లేదు... టీవీలు, సెల్‌ఫోన్లు లేవు. ప్రస్తుత సమాజాన్ని కుంగదీస్తున్న ఎలాంటి అవలక్షణాలేవీ అక్కడ కనిపించవు. ప్రజలందరూ బాహ్య ప్రపంచాన్ని ఆధ్యాత్మిక చింతనతో దర్శిస్తూ ప్రకృతి ఒడిలోనే సుఖంగా బతుకుతున్నారు.**

ఉన్నత చదువులు, పెద్ద ఉద్యోగాలతో సంపన్న శ్రేణి జీవనాన్ని అనుభవించినప్పటికీ... జీవిత పరమార్థం ఇది కాదని భావించిన వారంతా అన్వేషణలో భాగంగా పరమాత్మకు చేరవయ్యే వికాసమార్గం.. సనాతన 'ధార్మిక జీవనం'గా భావించి సరికొత్త జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు.

కాలం మారుతున్నకొద్దీ అలవాట్లు, పద్ధతులూ మారుతుంటాయి. కాలం మనుషులను అలా ముందుకు తీసుకు వెళ్తూ ఉంటుంది. అయితే కాలానికే ఎదురు నిలుస్తూ పూర్తిగా పాత పద్ధతులను అనుసరిస్తూ విభిన్న పంథాను అనుసరిస్తున్నారు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న కూర్మ గ్రామానికి చెందిన ప్రజలు.

## వైదిక వర్ణాశ్రమ పద్ధతులు

ఇప్పటికీ ప్రాచీన వైదిక వర్ణాశ్రమ పద్ధతులు పాటిస్తున్న గ్రామంగా కూర్మ గుర్తింపు పొందింది. ప్రాచీన భారతీయ గ్రామీణ ప్రజల పద్ధతులు, గురుకుల జీవన విధానానికి ఈ గ్రామం నిలువుటద్దంలా ఉంది.

200 యేళ్ల నాటి భారతీయ గ్రామీణ జీవన విధానం, సాంప్రదాయాలు, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, కట్టుబొట్టు, వృత్తులు, వీటన్నింటిని ఒకే చోట కలపోసినట్లుగా కనిపిస్తోంది కూర్మ గ్రామం. ఈ గ్రామాన్ని 2018 జులైలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంస్థాపకచార్యులైన భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు, వారి శిష్యులు ఏర్పాటు చేశారు.



మొదట్లో కొద్ది మందితో ప్రారంభమైన కూర్మ గ్రామంలో ప్రస్తుతం 12 కుటుంబాలు, 16 మంది కలిపి మొత్తం 56 మంది నివసిస్తున్నారు.

బ్రిటిష్‌వారి ఏలుబడిలో భారతీయ వర్ణాశ్రమ వ్యవస్థ గాడి తప్పడంతో తిరిగి ప్రపంచాన్ని సనాతన ధర్మంవైపు మరల్చడమే ధ్యేయంగా కూర్మ గ్రామం ప్రజలు సంకల్పించుకుని ఆ దిశగా ప్రచార కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పూర్వ కాలంలో మన తాత ముత్తాతలు ప్రకృతితో మిళితమై జీవిస్తూ ఎంతో ఆనందంగా గడిపారు. ప్రకృతితో కలిసి మనిషి జీవితం ఎలా అన్నది భారతీయ సంస్కృతే చాటి చెప్పింది. అలాంటి జీవితంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది ఈ గ్రామం.

కూర్మ గ్రామంలో ఉన్నవారంతా గొప్ప కుటుంబాల్లో పుట్టి పెరిగినవారే. ఉన్నత చదువులు చదివి లక్షల్లో జీతాలు వచ్చేసంస్థల్లో పని చేసినవారే. కానీ యాంత్రిక జీవితానికి విసుగు చెంది ప్రకృతిలో మమేకమై పరమానందం పొందేందుకు కుటుంబ సమేతంగా అన్నీ వదిలి కూర్మ గ్రామంలో నివసిస్తున్నారు.

కార్లు, బంగ్లాలు ఉన్నా వాటి నుంచి వచ్చే ఆనందం కంటే మట్టి ఇంటిలో, పూరి గుడిసెలో నివసిస్తున్నప్పుడే చాలా ఆనందంగా ఉందని వీరు చెబుతున్నారు. తమ కుటుంబాలను వదిలి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా, ఇతర దేశాల నుంచి కూడా పలువురు కూర్మ గ్రామానికి భగవంతుని సేవ కోసం వస్తున్నారు.



సరళ జీవనం, ఉన్నత చింతనం కూర్మ గ్రామస్తుల ప్రత్యేకత. నిత్యావసరాలైన కూడు, గుడ్డ ప్రకృతి నుంచే పొందవచ్చని నిరూపిస్తూ, ప్రకృతి సేద్యంతోనే వీటిని పొందుతున్నారు.

ఈ ఏడాది గ్రామస్తులంతా కలిసి ఉమ్మడిగా 198 బస్తాల ధాన్యాన్ని పండించారు. సరిపడా కూరగాయలను సైతం పండించుకుంటున్నారు. విత్తనం నాటింది మొదలు, కోతల వరకు ఇతరులపై అసలు ఆధారపడరు. రసాయనాలు లేని వ్యవసాయంతో సొంతంగా నచ్చిన కూరగాయలు పండిస్తుంటారు.

పశుపోషణ కూడా చేస్తారు. దంపుడు బియ్యాన్ని వండుకు తింటారు. తమ దుస్తులకు వారే నేత కార్మికులు.

## స్వయంగా ఇళ్ల నిర్మాణం



ఇళ్ల నిర్మాణానికి వారే మేస్త్రీలు, కూలీలు, ఇసుక, సున్నం, బెల్లం, మినుములు, కరక్కాయలు, మెంతులు మిశ్రమంగా చేసి గానుగలో ఆడించి గుగ్గిలం మరగబెట్టిన మిశ్రమంతో ఇళ్లు నిర్మించుకుంటారు. ఇళ్ల నిర్మాణంలో సిమెంటు, ఇనుమును ఏ మాత్రం వాడరు.

## నో ఎలక్ట్రిసిటీ

గ్రామస్తులు కుంకుడుకాయ రసంతో బట్టలు ఉతుక్కుంటారు. విద్యుత్‌ను అసలు వాడరు. ఇళ్లలో లైట్లు, ఫ్యాన్లు ఉండవు. కూర్మ గ్రామంలో విద్య, వర్ణాశ్రమ విధానంలో ఉంటుంది. విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీలో అనర్గళంగా మాట్లాడతారు. ఈ ఆశ్రమంలో తెల్లవారుజామున 4 గంటల 30 నిమిషాలకు దైవానికి హారతితో దినచర్య ప్రారంభమవుతుంది. ఉదయం భజన, ప్రసాద స్వీకరణ తర్వాత రోజువారీ పనులకు వెళతారు. వ్యవసాయం, ఇళ్ల నిర్మాణం, ధర్మప్రచారంలో గ్రామస్తులు మమేకం అవుతారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



## ఉచిత విద్య

ఇక్కడి గురుకులంలో విద్యార్థులకు ఉచిత చదువుతో పాటు సకల శాస్త్రాలను, వైదిక శాస్త్ర ఆధారిత విద్యా విధానం, ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ, సత్ప్రవర్తన, శాస్త్ర అధ్యయనంతో పాటు వ్యవసాయం, చేతివృత్తులు, తల్లిదండ్రులకు, గురువుకు సేవ చేయడం లాంటివి సైతం నేర్పుతారు.

కూర్మ గ్రామం గురించి తెలుసుకున్న ఎంతో మంది ఇతర ప్రాంత వాసులు ఇక్కడకు వచ్చి ప్రజలు పాటిస్తున్న పద్ధతులను చూసి ఎంతో మురిసిపోతున్నారు. తమ పిల్లలకు సైతం వాటిని నేర్పిస్తున్నారు.

ప్రాచీన గ్రామీణ వాతావరణానికి, ఆధ్యాత్మిక చింతన కలగలిసిన కూర్మ గ్రామాన్ని ఇలా ప్రతినిత్యం వందల మంది సందర్శిస్తున్నారు. విద్యుత్ ఉంటే దానితో పాటు సౌకర్యాలు పెరుగుతాయని, అందుకు డబ్బు అవసరం అని, దానివల్ల జీవితం యాంత్రికంగా మారి, మనుషులు కూడా యాంత్రికంగా మారతారని కూర్మ గ్రామస్తులు అంటున్నారు.

ప్రపంచం అంతా ఆధునిక జీవన విధానంతో ఉన్నతంగా జీవిస్తుంటే ప్రకృతి సిద్ధ జీవితంతో కూర్మ గ్రామస్తులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.

---

# ప్యారడీ పాట




"ప్రేమనగర్" చిత్రంలోని "నేను పుట్టాను లోకం ఏడ్చింది నేను ఏడ్చాను లోకం నవ్వింది" పాటకు ప్యారడీ.

పల్లవి: నేను పుట్టాను మా ఊరు షాకైంది
నేను పెరిగాను మా ఊరు ఆశ్చర్యపోయింది
నాకింకా మా ఊరుతో పని ఏముంది...
డోంట్ కేర్ ॥నేను॥



చరణం: నేను పెరిగితే కొందరి నోళ్లు మూతపడ్డాయి
నేను తగ్గితే కొందరి కళ్లు బైర్లు కమ్మాయి
నేను లేకుంటే కొందరు గుసగుసలాడారు
భలేగా సరదా పడ్డారు..
డోంట్ కేర్ ॥నేను॥

చరణం: నన్ను చూసి కొందరు ఈర్ష్యపడ్డారు
నా చెంతకు రాలేక వెనుకకు తిరిగారు
నా దగ్గరకొస్తే ఏమౌతుందో
వాళ్లకు తెలిసే రాలేదు..
డోంట్ కేర్ ॥నేను॥

– **వైదా ఈశ్వరరావు**, విశాఖపట్నం

## జోక్స్

భార్య: ఎందుకండీ? మన ప్రయాణం కేన్సిల్ చేసారు? ఏమైనా అర్జెంటు పని వచ్చిందా?

భర్త: ఇంతకుముందే నా రాశిఫలాలు చదువుకున్నాను. ఆఖరి క్షణంలో ప్రయాణం రద్దు అవుతుందని ఉంది. అందుకనే క్యాన్సిల్ చేసాను.

....................

భార్య: నేను మా కజిన్ పెళ్లికి వెళ్తున్నాను, ఏం చదివించమంటారు?

భర్త: కొత్తగా నీవేమీ చదివించనక్కరలేదు, ఆమె ఆల్రెడీ పి.జి. చదివిందని చెప్పావుగా.

కథ

**హాలు హాలులాగ లేదు. కార్యక్రమానికి వచ్చిన అందరితో కోలాహలంగా ఉంది. కామధేనుకున్న ఒక్కగానొక్క కూతురు సయోధ్య పెళ్లి నిశ్చయ తాంబూలాల వేడుక జరుగుతోంది.**

**ఆయనగారి మనసు ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. ఇక కామధేను భార్య వరుణ సంగతి అయితే సరేసరి. వచ్చి బంధువుల్ని సముదాయించడంలో ఆమె తలమునకలై ఉంది.**

వడలి రాధాకృష్ణ

# జీవ ధ్వని

కూటికుప్పల భాస్కరంవారిది బొబ్బిలిలో అయినింటి కుటుంబం. కుర్రాడు ఇంజినీరింగ్ చదివి కాన్పూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మంచి ప్యాకేజి కూడాను. అన్నలకు, ఒదినలకు, తమ్ముళ్లకు, మరదళ్లకి విషయాన్ని వివరించి చెబుతున్నాడు.

“అయితే కొత్త వియ్యంకుడుగారు భాస్కరం అన్నమాట. దానికి కాసింత సూరే కారాన్ని జత కలిపామంటే టపాసులు సూపర్‌గా వెలుగుతాయి” బావ భాగిమూర్తి తనదైన రీతిలో సెటైర్లు వేస్తూ ఉన్నాడు.

“ఊరుకోండి మీరు... నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తారు. అదే మీ దగ్గర వచ్చిన చిక్కు. అన్నయ్య మరోలా అనుకోగలడు”.

“అనుకోవడమేమిటో! సూరే కారానికి భాస్వరం కలగలిస్తేనే కదా, పటాసులు పేలేది! పండుగ జరిగేదీను”

“ఇక్కడ భాస్వరాలు లేవు. సూరేకారాలు అంతకన్నా లేవు. ఆ మాటలు ఆపండి” గట్టిగా హెచ్చరించింది భాగిమూర్తి భార్య భాస్కరమ్మ.

“లేకపోతే నత్రజని, భాస్వరం, పొటాష్ మిశ్రమం అనుకో. అవి కలిపి చల్లితేనే కదా మాగాణిలో పైరు ఏపుగా పెరిగేది. మన కడుపులు నిండేదీను.

“ఊరుకో చెల్లెమ్మా! బావమాట సంగతి బంగినిపల్లి తోటపూత సంగతి ఎరుగంది ఎవరు చెప్పు?” చిన్నన్న విష్ణుమూర్తి సముదాయిస్తున్నాడు.

“పెళ్లివారు అరగంటలో దిగిపోతారు. దుర్ముహూర్తం వెళ్లిన వెంటనే నిశ్చయ తాంబూలాలు తీసుకునేందుకు కూర్చోవాలి” కామధేనువుగా అన్నీ తానై అందరికీ పనులు పురమాయిస్తున్నాడు.

“మాటలు చెప్పుకుంటూ మైమరచిపోవడం కాదు. పెళ్లివారు వచ్చేసరికి పెళ్లికూతుర్ని రెడీ చెయ్యాలి, టిఫిన్లు, కాఫీలు తయారుగా ఉంచాలి”.

“పురోహితుణ్ణి పురమాయంచారు గదా!”

“వచ్చేశా! ఇక మీదే లేటు” అప్పుడే ఫంక్షన్ హాల్‌లోకి అడుగుపెట్టిన శుక్ర శాస్త్రిగారి మాట కామధేనుకి శుభకరంగా అన్పిస్తోంది.

బొబ్బిలి నుండి నాలుగు టాటా సుమోలలో దిగిన కాబోయే వియ్యాలవారికి బాగానే స్వాగతం లభించింది అక్కడ. ఏర్పాట్లు చూసుకొని పెళ్లికొడుకు తండ్రి భాస్కరంగారు తృప్తిగా నిట్టూర్చాడు. తాంబూలాలప్పుడే ఇంత గొప్పగా ఏర్పాటు చేసిన కామధేను పెళ్లిని మరెంత వైభవంగా చేయగలరోనని అంచనా వేసుకోసాగాడు.

నిశ్చయ తాంబూలాల తంతు సక్రమంగా జరిగిన తర్వాత భాస్కరంగారే విషయాన్ని లేవనెత్తాడు. “పెళ్లికి మా తరపున అరవై మందిదాకా వస్తున్నాం. బొబ్బిలి నుండి అమలాపురానికి రానుపోను బస్సు ఏర్పాటు చేయవలసిన బాధ్యత మీది”.

“బస్సు తాలూకు రానుపోనూ ఖర్చు మన పెళ్లిమాటల్లో లేవు కదండీ!”



“బస్సులో తీసుకెళ్లి పెళ్లి అయిన తర్వాత తీసుకొచ్చి బొబ్బిలిలో వదిలెయ్యాలి”

“లోకంలో ఎక్కడయినా మగపెళ్లివారి ప్రయాణపు ఖర్చులు చెరి సగం భరించడం రివాజు. అటువంటిది ఇప్పుడు..” వరుణ భాస్కరం గారిని నిలువరించాడు.

“చెప్పానా? భాస్వరానికి పిడికెడు సూరే కారాన్ని జత కలిపినామంటే ఇక పటాసుల పేలుడే అని” బావ భాగిమూర్తి భార్య భాస్కరమ్మ చెవి దగ్గర ఏకరువు పెడుతున్నాడు.

“మిమ్మల్ని నోరు మూసుకు కూర్చోమన్నాను. వాళ్లు వాళ్లు మాట్లాడుకుంటారు. అయినా ముహూర్తం నిశ్చమయిన తర్వాత ఆయన మాటకు ఈయన తగ్గాలి, ఈయన మాటలని ఆయన ఆలకించాలి”.

“బాధ్యత అంతా మీరే తీసుకోవాలి బావగారూ. మంచి సూపర్ డీలక్స్ ఏసి బస్సును ఏర్పాటు చేయండి. బస్సులో మీ తరపున ఒకరిని పంపించాలి. మీరు ఏమనుకున్నా సరే. ఇది జరిగి తీరాల్సిందే!”

కామధేను కాదనలేకపోయాడు.

............

అమలాపురంలో కూతురు పెళ్లి ఏర్పాట్లు చక్కగా చేసుకున్నాడు కామధేను. ఒక్కగానొక్క కూతురు కావడంతో అయినవారినందర్నీ పిల్చుకున్నాడు.

రెండు రోజుల ముందే అమలాపురం రావాలని అందరికీ షరతు పెట్టాడు కూడాను. "బొబ్బిలి నుండి మగపెళ్లివారు, బస్సు సంగతి నాకు అప్పగించేసేయ్! రెండో అన్నగారు విష్ణుమూర్తి ముందుకొచ్చాడు.

"నాకు తెలిసిన ట్రాన్స్‌పోర్ట్ ఏజెంట్‌ను సంప్రదించాను. ఏమీ ఇబ్బంది ఉండదు"

"నాకు చెప్పడం కాదు. ఆ భాస్కరం గారితో మాట్లాడు. రేపు ఆ బస్సు బాగాలేదు, మరోటి మాట్లాడమని అన్నాడంటే ఇరుకున పడతాం. అసలే పెళ్లిళ్ల సీజన్" విష్ణుమూర్తికి తమ్ముడిమాట సహేతుకంగా అనిపించింది. వెంటనే బొబ్బిలికి బయలుదేరాడు.

"మంచిది బావగారూ! ప్రయాణంలో చిన్న మార్పు చేయాల్సి వచ్చింది. మా బంధువులు చాలామంది గరివిడి, రాముదువలస, విజయనగరంలలో ఉన్నారు. వాళ్లందరూ వివిధ కారణాల వలన అనుకున్న సమయానికి బొబ్బిలి చేరుకోలేమని కబురు పెట్టారు. కాబట్టి బొబ్బిలి నుండి బయలుదేరి పెళ్లిబస్సు గరివిడి వెళుతుంది. అక్కడి నుండి రాముదువలస మీదుగా విజయనగరం చేరుకుంటుంది. విజయనగరం నుండి అమలాపురం చేరుతుంది. మీకు చెప్పేదేముంది.. తర్వాత"

విష్ణుమూర్తికి అరికాలుమంట నెత్తికెక్కేసింది. కానీ వియ్యంకుడి మాటను కాదనలేకపోతున్నాడు. కామధేనుకి ఫోన్ చేశాడు. "బస్సు ఓనరుకి పాతిక వేలు అడ్వాన్సు ఇస్తిమి. బొబ్బిలిలో బస్సు ఎప్పుడు బయలుదేరాలో కాగితం రాసుకుంటిమి. ఇప్పుడు బస్సు రూటు మారుస్తానంటే బస్సు ఓనరు ఒప్పుకోడు".

అదే విషయం భాస్కరంగారితో చెప్పాడు.

"బంధువులంతా ఇక్కడికొచ్చే అవకాశమే లేదు. వాళ్లందరూ రాకుండా అక్కడ నా కొడుకు పెళ్లేమిటి? పెళ్లి అయిన తర్వాత వారి వారి ఊళ్లల్లో దింపేసి వచ్చే విధంగా బస్సు రూట్ మ్యాప్ మార్చండి".

విష్ణుమూర్తికి ఏమీ తోచకుండా ఉంది. భాస్కరంగారు చెప్పిన విధంగా బస్సురూటు మార్పు చేయక తప్పింది కాదు.

"కూటికుప్పలవారి పెళ్లిసందడి.. విశ్వజిత్ వెడ్స్ సయోధ్య" బస్సు ముందర కట్టిన ఫ్లెక్సీ బ్యానర్ మంగళప్రదంగా అన్పిస్తోంది.

విశ్వజిత్ ఇంజినీరింగ్ చదివి కాన్పూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అబ్బాయి చూడచక్కగా ఉన్నాడు. విష్ణుమూర్తికి సంతృప్తిగానే అన్పిస్తోంది. కామధేను అదృష్టవంతుడు. చక్కని అల్లుణ్ణి వెతికి పట్టుకోగలిగాడు. ఇక సయోధ్య అయితే ఎన్నో బంగారు పూలతో పూజలు చేసి ఉంటుంది. బంగారంలాంటి మొగుడు దొరికాడు.

ఇక పెళ్లికొడుకు తండ్రి గొప్ప చాదస్తుడు. కాసింత పిసినారి లక్షణం కలిగినవాడు కూడాను. ప్రతి విషయానికి కామధేనును పట్టుకొని అదేపనిగా పీడించేస్తున్నాడు.

"పోనీలేరా! మనకు కుర్రాడు ముఖ్యంగానీ, మిగతావన్నీ చిన్న చిన్న విషయాలు, వాటిని అంత సీరియస్‌గా తీసుకోనవసరం లేదు" పెద్ద అన్నయ్య రామమూర్తిగారు తమ్ముడికి చెబుతున్నాడు.

కామధేను కూడా మిగతా విషయాలను పెద్ద సీరియస్‌గా తీసుకోవడం లేదు. అదే వియ్యంకుడి మాటను దేనినీ వెనక్కి తీసుకోకుండా ముందుకు వెళ్లిపోతున్నాడు.

పెళ్లి బస్సు బయలుదేరింది. బొబ్బిలి నుండి బయలుదేరిన బస్సు అనేక ఊళ్లను చుట్టుముట్టి రావాల్సి వస్తోంది. తిరిగి కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బస్సు ఓనరు, డ్రైవరు తమకు బాగానే సహకరిస్తున్నారు. చెప్పాలంటే ఈ పెళ్లివారి బస్సు యావత్ ఉత్తరాంధ్రను చుట్టుముట్టేసి వస్తున్నట్లుంది.

ఇంత గొప్పగా పెళ్లిఏర్పాట్లు చేసినందుకు వివిధ ప్రాంతాలలో ఉన్న బంధువులందరూ భాస్కరాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. బస్సులోని పెళ్లివారికి కాఫీలు, టిఫిన్లు చక్కగా ఏర్పాటు చేయబడ్డాయి. విష్ణుమూర్తి బస్సులో అన్నింటినీ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు.

"మీ వియ్యాలవారు మంచి మర్యాదస్తులు భాస్కరం!" విష్ణుమూర్తి మాటతీరును ఆదరణను చూసినవారు అందరూ అదేపనిగా కితాబునిస్తున్నారు. మగపెళ్లివారికి ఏర్పాటు చేసిన ఏసి డీలక్స్ బస్సు చాలా బాగుంది.

బస్సులోపల పెళ్లి సందడి వాతావరణం అగుపిస్తోంది. ఎప్పటికప్పుడు బస్సు ఏ ఊరు వచ్చిందీ, ఎంత మంది ఎక్కుతున్నదీ, ముహూర్తానికి ఎన్ని గంటల ముందు వచ్చేదీ, అమలాపురానికి ఎప్పుడు చేరేదీ మొదలైన విషయాలన్నీ తమ్ముడితో విష్ణుమూర్తి చర్చిస్తూనే ఉన్నాడు.

అన్ని ఊళ్లలోనివారు బస్సు ఎక్కిన తర్వాత బంధువులందరూ మగపెళ్లివారయిపోతున్నారు. "మగ ఇగో!!" తమ నైజంగా మారిపోతోంది. పెళ్లి విషయాలు ఆడపెళ్లివారి స్థితిగతులు పెళ్లికూతురు చదువుసంధ్యలు, కట్నకానుకలు లాంఛనాలు అన్నీ అదేపనిగా చర్చకు వస్తున్నాయి.

విష్ణుమూర్తి అన్నీ ఆలకిస్తూనే ఉన్నాడు. ఏది ఏమయినా తమ్ముడు అదృష్టవంతుడు. మంచి సంబంధం దొరికింది. అమలాపురంలో కామధేనుగారి కూతురు పెళ్లి ఏర్పాట్లు ఘనంగా ఉన్నాయి. మరో మూడు నాలుగు గంటలలో పెళ్లివారు వచ్చేస్తారు. రాత్రి డిన్నరు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అర్ధరాత్రి ముహూర్తం. బంధువులు ఒక్కొక్కరే విచ్చేస్తూ ఉన్నారు.

............

కామధేనుతో సహా అందరూ హతాశులైపోతున్నారు. పిడుగుకన్నా

**"బంధువులంతా ఇక్కడికొచ్చే అవకాశమే లేదు. వాళ్లందరూ రాకుండా అక్కడ నా కొడుకు పెళ్లేమిటి? పెళ్లి అయిన తర్వాత వారి వారి ఊళ్లల్లో దింపేసి వచ్చే విధంగా రూట్ మ్యాప్ మార్చండి". విష్ణుమూర్తికి ఏమీ తోచకుండా ఉంది. భాస్కరంగారు చెప్పిన విధంగా బస్సురూటు మార్పు చేయక తప్పింది కాదు.**

పెద్ద వార్త అది. పెళ్లివారితో వస్తున్న బస్సు హైవే మీద ఎదురుగా వస్తూన్న ట్రక్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా కొట్టేసింది.



అదృష్టంకొద్దీ ఎవరికీ ప్రాణ నష్టం కలగలేదు. పెద్ద దెబ్బలు తగలకుండా బయట పడ్డారు. కానీ ఎవరికి తగలకూడదో వారికి మాత్రం పెద్ద గాయాలయ్యాయి.

బస్సు డ్రైవర్, ముందు సీట్లో కూర్చున్న పెళ్లికొడుక్కి బాగా దెబ్బలు తగిలాయి. పెళ్లికొడుకు స్పృహ కోల్పోయాడు. విషయం తెలిసినవారందరూ అమలాపురంలో అందరూ ఖిన్నులయిపోయారు. దెబ్బలు తిన్నవారిని దగ్గరలో ఉన్న హాస్పిటల్‌లో చేర్చాల్సి వచ్చింది. దానితో ముహూర్తాన్ని వాయిదా వేసుకోక తప్పలేదు. కామధేనుతో సహా అందరూ హుటాహుటిన యలమంచిలికి ప్రయాణమయ్యారు.

"ఎవరికీ ప్రాణభయం లేదు" ముఖ్యంగా పెళ్లికొడుకు నిస్సత్తువలోకి జారిపోతూ ఉన్నాడు. అతనికి స్పృహ రావడానికి సమయం పట్టవచ్చు.

"పెళ్లికూతురు నష్టజాతకురాలు. ఆమె వస్తూన్న వేళావిశేషం మంచిది కాదు. కీడును తెచ్చిపెడుతోంది" అందరూ చెవులు కొరుక్కోవడం మొదలైపోయింది.

ఈ పరిణామాన్ని భాస్కరంలో సహా అందర్నీ నివ్వెరపరుస్తున్నాయి.

.......

కూతురు పెళ్లి వాయిదా పడినప్పటి నుండి కామధేను తీవ్రమైన ఆందోళన చెందుతున్నాడు. వరుణ అయితే సరేసరి. కాబోయే అల్లుడు త్వరగా కోలుకోవాలని వేయి దేముళ్లకి మొక్కుకుంటూ ఉంది. భాస్కరంగారు డబ్బుకు వెనకాడటం లేదు. పెద్ద వైద్యం కోసం పట్నానికి తీసుకుపోయాడు.

కలలో కూడా ఊహించని విషయం హాస్పిటల్ వర్గాల నుండి తెలిసేసరికి కామధేను తల మీద పిడుగు పడ్డట్లయింది. నిలువెల్లా కంపించిపోతున్నాడు. అదేపనిగా బుర్ర మొద్దుబారిపోయి వణికిపోతున్నాడు.

బస్సు బోల్తా కొట్టిన సందర్భంలో విశ్వజిత్‌కు దెబ్బలు బాగా తగిలాయి. వాటికి ట్రీట్‌మెంట్ చేయించే సందర్భంలో వినకూడని నిజాన్ని వినాల్సి వచ్చింది.

కుర్రాడికి పుట్టుక నుండే నరాలకు సంబంధించిన ఆరోగ్య సమస్య ఉందట. దాన్ని కప్పిపుచ్చి ఇప్పుడు కొడుక్కి పెళ్లి చేస్తున్నాడు భాస్కరం.

ఇప్పుడు నార్మల్‌గా అన్ని టెస్టులు చేయాల్సి రావడంతో వ్యాధి లక్షణాలు బయట పడ్డాయి.

"... ... ... ..."

"దీనవలన భవిష్యత్‌లో అతనికి ఊహించని అనారోగ్య సమస్యలు ఎదురు కావచ్చు. తమకు తెలిసిన పెద్ద డాక్టర్ ద్వారా తెలిసిన విషయాలు కామధేనుని విస్మయపరుస్తున్నాయి.

"అయితే మీరిచ్చే సలహా?" డాక్టర్ గారిని వేడుకున్నాడు కామధేను.

"సలహా ఏముంటుంది? ఈ అబ్బాయి నిజంగా మీ ఇంటి అల్లుడు అయితే మీ కూతురు గొంతు కోసినట్లే అవుతుంది".

"... ... ... ..."

"ఈ కుర్రాడి తల్లిదండ్రులు మీ పెళ్లి మాటలకు ముందు ఈ వ్యాధి సంగతి చెప్పారో లేదోగానీ అతగాడికి కొన్ని సంవత్సరాలుగా ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నట్లు ప్రస్తుత పరిస్థితిని బట్టి అర్థమవుతోంది" కామధేను నిలువెల్లా అదేపనిగా కంపించిపోతున్నాడు.

భవిష్యత్ చాలా భయానకంగా అనిపిస్తోంది. లోపాయికారిగా రిపోర్ట్స్ తీసుకెళ్లి ఇద్దరు ముగ్గురు పెద్ద పెద్ద డాక్టర్లని సంప్రదించాడు. వాళ్ల ఇచ్చిన సలహాలన్నీ ఒకే విధంగా ఉండటంతో తండ్రిగా కూతురు జీవితం గురించి, ఆమె భవిష్యత్ గురించి నిర్ణయం తీసుకోక తప్పడం లేదు.

భాస్కరాన్ని అడిగి చూశాడు. మొదట పక్కచూపులు చూసి మాట దాటేయబోయాడు. అన్ని ఆధారాలతో గట్టిగా నిలదీసేసరికి అసలు విషయాన్ని ఒప్పుకోక తప్పలేదు.

కొడుక్కి వున్న ఆరోగ్య సమస్యల్ని కప్పిపుచ్చి మోసం చేసి పెళ్లి చేస్తున్న అతగాడి ధోరణి మింగుడు పడకుండా ఉంది.

కామధేను ఆలోచించాడు. భార్యతో సంప్రదించాడు. కుటుంబంలోని తోడబుట్టినవారికి చెప్పి చూశాడు. చివరికి ఈ నిర్ణయానికి రాక తప్పడం లేదు. రంగుల రథం లాంటి ఆ పెళ్లి బస్సు పల్టీ కొట్టి తనను, తన కూతురు జీవితాన్ని కాపాడింది. ఒక దుర్మార్గమైన ఉచ్చు నుండి తమను రక్షించింది.

ఈ వివాహ ప్రతిపాదనను రద్దు చేసుకుంటున్నామని భాస్కరంతో చెప్పడానికి సమాయత్తమవుతున్నాడు. అలా చేడంతో కామధేను ముఖంలో ఇప్పుడు అంతులేని ఆత్మస్థైర్యం కానవస్తూ ఉంది.

## భోగిపళ్ల సంప్రదాయం అందరూ పాటించవచ్చా?

రేగుపళ్లను "భోగిపళ్లు" అని కూడా పిలుస్తారు. సంస్కృతంలో వీటిని "బదరీ" ఫలం అంటారు. బద్రీనాథ్‌లో నరనారాయణులు భోగి రోజున తపస్సు ప్రారంభించినట్లు తెలుస్తోంది. విష్ణువు చేసిన తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరాలు ఇచ్చాడు. ఆ రోజు భోగి పండుగ కావడం మరో విశేషం. ఆ రోజున దేవతలంతా రేగుపళ్లను మహావిష్ణువు తలపై పోసి అభిషేకం చేసారు. అప్పటి నుంచి భోగిపళ్లు పోసే సంప్రదాయం వాడుకలోకి వచ్చింది. కనుకనే చిన్నపిల్లలకు భోగిపళ్లు పోసే సంప్రదాయం ఆనవాయితీగా వస్తోంది. చిన్న పిల్లలున్న ఇంట్లో ఈ సంప్రదాయం పాటించవచ్చు.



## కనుమనాడు ప్రయాణం చేయకూడదా?

కనుమరోజు కాకి కూడా కదలని పెద్దల నానుడి. తెల్లారింది మొదలు చీకటి పడేవరకు కాకి పొట్ట కూటికోసం తిరుగుతూనే ఉంటుంది. కాకిని పితృపక్షి అంటారు కదా. అలాంటి కాకి కూడా ఆరోజు తిండి కోసం వెదుక్కోవలసిన అవసరం ఉండదు. ఎందుకంటే కనుమ పెద్దలకు సంబంధించిన పండుగ. ఆ రోజు పితృదేవతలకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అందుకని కనుమనాడు ఇంటివద్ద వుంటేనే ఆ పని చేయడం కుదురుతుంది.

# ప్రాచీన తెలుగులో ప్రాకృత పరిమళం

జయసూర్య

తెలుగు భాషా సాహిత్యాలకు, దేశానికి, సంస్కృతికి, నవ్యతకు సంబంధించిన వికాసం కోసం అనవరతం శ్రమించిన మారేపల్లి రామచంద్రశాస్త్రి, ఆంధ్రదేశంలో మొట్టమొదటి గ్రంథమాలికా ప్రచురణకు పూనుకొన్న తెలుగుభాషా ప్రేమికులు, సాధ్యమైనంతవరకు సంస్కృతాన్ని ఉపయోగించకుండా, తెలుగంటే ఆరోప్రాణంగా 'నుడికడలి' పేరుతో తెలుగు భాషాసాహిత్యాలకు, దేశానికి, సంస్కృతికి సంబంధించిన సాహితీ సంస్కరణాయుత నిర్మాణాన్ని 1945 ప్రాంతాలలో ఆయన తలపెట్టారు. ఉత్తరాలలో 'క్షేమం' అనడానికి 'మేలొ', దేశం, ప్రాంతం చెప్పాల్సి వచ్చినప్పుడు 'నాడు', 'నిఘంటువు'ను 'నుడిదండ', గ్రంథాలయాన్ని 'పొత్తపు గుడి' వంటి, తెలుగు పదాలను ఉపయోగించేవారు. పరాయి భాషల నుండి తెలుగుభాషలోని పదాలు ఏయే మార్పులు, కూర్పులు, చేర్పులు, నేర్పుల ద్వారా ఇప్పటి వ్యవహారంలోకి వచ్చాయో, మన పూర్వకవులు కావ్య, ప్రబంధ సాహిత్యాలలో ఆ పదాలను భావప్రకటన కోసం ఎలా వాడుకున్నారో సందర్భానుసారంగా నిఘంటువులో సూచించే పదాల అర్థవివరణ 'మచ్చునుడు'లలో చేర్చారు. తెలుగులో వాడుకలో ఉన్న సామెతలను కూడా ఆధారంగా చూపించారు. ఆయన మహత్తర కృషి తీవ్రవిస్మరణకు గురికావడం మన దౌర్భాగ్యం.




భారతదేశంలో పద్దెనిమిది భాషలను రాజ్యాంగం గుర్తించింది. 1933లో పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, 'ప్రాకృత గ్రంథకర్తలు-ప్రజాసేవానూ' లోను, చీమకుర్తి శేషగిరిరావు 'తెలుగు మఱుగులు' పుస్తకాలలోని విషయాలను తెలుగు భాషా సాహిత్య మూలాల అపురూప సంపద పరిరక్షణ గురించి తపించే డా॥ అక్కిరాజు రమాపతిరావు, ఆచార్య జయధీర్ తిరుమలరావు వంటి మేధావులైన పరిశోధకులు వెలుగులోకి తెస్తున్నారు. సోదరభాషల అధ్యయనం వల్ల తెలుగుభాష మరింత జీవంపొందే అవకాశాలను పాదుకొల్పిననాడే, భాష సంపన్నవంతం అవుతుంది. కాని ఆ పరిస్థితులు దేశభాషలకు సంబంధించి కనపడటంలేదు. ఒకప్పటి ప్రాచీనకాలంనాటి ప్రాకృతం ప్రజల వ్యవహారభాష. అందుకే జైన, బౌద్ధసాహిత్యమంతా ప్రాకృతంలోనే ఉంది. తెలుగురాజులైన శాతవాహనుల కాలంలో ప్రాకృతం విలసిల్లింది. వివిధకవులు రచించిన గాథలుగా 'గాథాసప్తశతి' రూపొందింది. జైన, బౌద్ధాచార్యులు ఎక్కువ పాళ్ళు ప్రాకృతంలో, తక్కువ పాళ్ళు సంస్కృతంలో రాశారు. కాలక్రమేణా వ్యవహార తెలుగుభాషను గ్రాంథిక భాషావాదులు అపభ్రంశమని, గ్రామ్యమని నిందించి నిరాకరించినట్టే

ప్రాకృతాన్ని సంస్కృత పండితులు ఈసడించారు. తెలంగాణ ప్రాంతంలో శాతవాహన రాజులు తెలుగు పేర్లు పెట్టుకొన్నారు. నాణేలలో తెలుగు పదాలు వాడారు.

ప్రాకృత గ్రంథాలలో ఎన్నో తెలుగు పదాలున్నాయి. జనవ్యవహారంలో వేలాది పదాలున్నాయి. మన తెలుగు భాషావేత్తలు, పండితులు, భాషానిపుణులు తమదృష్టిని ప్రాకృతంవైపు మరల్చకపోవడం దురదృష్టకరం. ఆంగ్లేయుల దృక్కోణంలోంచే తెలుగును చూడ్డంవల్ల మనం ఎంతో కోల్పోయాం. దానికి తోడు జైన, బౌద్ధసాహిత్య గ్రంథాలు మతవిద్వేషదాడుల కారణంగా ధ్వంసం అయి, కనుమరుగయ్యాయి. తెలుగుభాష యొక్క ప్రాచీనరూపమైన 'అంధకము' వంటి పలు చారిత్రక అమూల్యతను ప్రాకృతానికి పోటీగా పరిణమించిన సంస్కృత (వైదిక) సాహిత్యం మరుగుపరిచింది. ఒకటవ శతాబ్దినాటికే స్థిరపడి దేశభాషగా ఉన్న తెలుగుభాష అణచివేయబడింది. సంస్కృతభాష రాజభాష, మతభాషగా అధికారంలో ఉండడం వల్ల, బలవంతంగా పాలక, పండిత, ధనికవర్గాలు ఇతరభాషలలోకి చొప్పించారు.

చీమకుర్తి శేషగిరిరావు 'తెలుగు మఱుగులు' పుస్తకంలో 33 ప్రాచీన తెలుగుపదాలలో మొదటిపదం 'అంధక' క్రీస్తుపూర్వం నుండి క్రీస్తుశకం మూడు, నాలుగు శతాబ్దాల వరకు వాడబడినట్లు తెలిపారు. తెలుగుభాషకు, తెలుగుజాతి నివసించి, విస్తరించిన ప్రాంతానికి, తెలుగుసీమ భూభాగానికి అంధక పదాన్ని వాడేవారు. అస్సక, అశ్మకులు అంధక రాజులని తెలుపబడింది.

అస్సక-అశమక (అశ్మక) దేశం లేదా జనపదం ప్రస్తుత నిజామాబాద్ పట్టణానికి ముప్పై ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న బోధన్ ప్రాంతంగా చరిత్రకారులు ధృవీకరించారు. ఆ ప్రాంత జనపదాలకు పదికిలోమీటర్ల దూరంలో మంజీరానది, పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో గోదావరీనది, పదహారు కిలోమీటర్ల దూరంలో హరిద్రానదులున్నాయి.

ఈ పరీవాహక ప్రాంతమంతా అస్సక, అశ్మక జనపదాలే అని బౌద్ధ వాఙ్మయం తెలుపుతోంది. ఆంధ్రపదమే ప్రాకృతంలో అంధక అయింది. క్రీ.శ. 4వ శతాబ్దం నాటికే 'అంధకము' ఒక సాహిత్యభాషగా రాణించిందని 'తెలుగు మఱుగులు' తెలియజేస్తోంది. అప్పటికే దేశభాష అయిన తెలుగు రాతలో, చదవడంలో తగిన అభివృద్ధి పొందింది. ప్రకృతి అయిన ప్రాకృతభాష నుండి సంస్కరించబడిన సంస్కృతం పాలక రాజవర్గాల ఆదరణ పొందింది. అలనాడు ఆరుగురు పండితులు రాళ్ళపల్లి, తల్లావఝుల, వేటూరి, చిలుకూరు, మానేపల్లి, వేలూరి, పింగళి, మేడేపల్లి, తిరుమల రామచంద్ర, ఆచార్య కమల వంటివారు మాత్రమే ప్రాకృతం నేర్చుకొన్నారు. తెలుగుభాషపై ప్రాకృతం ప్రభావం మరింతగా తెలుసుకోవాలంటే ఆ భాష తెలిసినవారు ప్రస్తుతం ఎవరూ లేరు. ఆంగ్లాన్ని నెత్తికెక్కించుకొంటున్న ప్రస్తుత కాలంలో, మాతృభాష తెలుగుకే దూరం అవుతున్న ప్రస్తుత యువతరం విదేశీభాషలు నేర్చుకోవడం పట్ల సహజంగా ఆసక్తి చూపిస్తున్నారు.

# జరిగేది జరుగుతుంది..

యామిజాల జగదీశ్

**ఓ ఊళ్ళో ఒకడున్నాడు. అతను ఓ మామూలు మనిషే. అతని దగ్గర ఓ జట్కా ఉంది. అదే అతని జీవనాధారం. దానికో గుర్రం. అది ఒక్క గుర్రం. జట్కా కూడా గుర్రానికి తగినట్టే ఉండేది. విరిగిపోయిన జట్కా. ఎప్పుడది మూలన పడుతుందో తెలీని స్థితి. ఆ పాత గుర్రబ్బండితోనే అతను నెమ్మదిగా రోజులు లాక్కొస్తోన్నాడు.**

ఓరోజు అతను ఆ బండి మీదే ఎక్కడికో వెళ్ళి తిరిగొస్తున్నాడు. అలా వస్తున్న మార్గంలో గుర్రం కాలు తడబడి కింద పడిపోయింది. కాలు విరిగింది. ఊళ్ళో ఉన్న వారందరూ విషయం తెలిసి జాలిపడ్డారు. అయ్యో పాపం.. అనుకున్నారు. అతనిని ఓదార్చారు. కానీ అతనేమీ బాధ పడలేదు. అతని ముఖాన విచారమేమీ కనిపించలేదు. జరిగేది జరుగుతుంది అనుకుంటూ అతను వెళ్ళిపోయాడు.

ఊరి ప్రజలకు ఆశ్చర్యం! ఏమిటీ? గుర్రం కాలు విరిగినప్పటికీ అతనేమీ బాధ పడలేదని.

అతనిప్రశాంతత... నెమ్మది...సీరియస్ గా తీసుకోకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

అతనెలా ఉన్నప్పటికీ సన్నిహితులు కొందరు అడవికి వెళ్ళి కొత్తగా ఓ గుర్రాన్ని పట్టుకుని అతనికి కానుకగా ఇచ్చారు.

ఈ విషయం తెలిసిన మరికొందరు ఏం చెప్పారంటే... "నువ్వు అదృష్టవంతుడివి....ఒక్క చిక్కిన గుర్రానికి బదులు నీకొక కొత్త గుర్రం దక్కింది. నీకేం...నువ్విక దర్జాగా బతకొచ్చు" అన్నారు.

వారి మాటకు అతనేమీ ఉబ్బి తబ్బిబ్బవలేదు. మామూలుగానే ఉన్నాడు. జరిగేది జరుగుతుంది అనుకున్నాడు. ఎప్పటిలాగే ఉన్నాడు.

కొన్ని రోజులైంది. ఏం జరిగింది తెలుసా.... అడవి నుంచి తీసుకొచ్చిన ఆ గుర్రం కాస్తా ఓ రోజు అడివిలోకి పారిపోయింది.

మళ్ళీ ఈ విషయం తెలుసుకున్న ఊరి ప్రజలు అతనిని చూసి జాలి పడ్డారు. మేము నీకిచ్చిన గుర్రం పారిపోయిందేమిటీ బాధపడ్డారు.

వారి ఓదార్పుగా చెప్పిన మాటలన్నీ విన్న ఆ జట్కా వాలా ఏమాత్రం ఆందోళన చెందలేదు. జరిగేదే జరుగుతుందని అన్నాడు. అంతా ఆ దేవుడి దయన మన చేతిలో ఏముంది అని అనుకున్నాడు.

మరికొన్ని రోజులైంది.

పారిపోయిన గుర్రం మరో అయిదు గుర్రాలతో అతని దగ్గరకు వచ్చింది. వెంటనే ఊరి ప్రజలు అతనిని కలిసి "అదృష్టం అంటే నీది....నీ దగ్గరిప్పుడు ఆరు గుర్రాలు ఉన్నాయి...నీ జీవితానికిక ఏ లోటూ లేదు" అని ఏవేవో మాటలన్నారు.

కానీ ఇప్పుడు కూడా అతను మామూలుగానే ఉన్నాడు. ఏ మాత్రం ఎగిరి గంతెయ్యలేదు. అప్పుడు కూడా ఎప్పటిలాగే జరిగేది జరుగుతుంది జరగనివ్వాల్సిందే అన్నాడు.

.... .... ....

ఆ తర్వాత మరికొన్ని రోజులకు ఏమైందో తెలుసా...

ఆ జట్కావాలా ఒక్కగానొక్క కొడుకు ఆ గుర్రాలను బాగా చూసుకుంటూ వచ్చాడు.

కానీ ఓరోజు ఓ మోటు గుర్రం ఆ కొడుకుని ఒక్క తన్ను తన్నింది. అతని కాలు విరిగింది.

మళ్ళీ ఊరి ప్రజలు జట్కా వాలాని కలిసి "అయ్యో! ఇలాగైందేమిటీ?" అని జాలి పడ్డారు.

అప్పుడు కూడా అతను ఏమీ బాధ పడలేదు. ఎప్పట్లాగే జరిగేది జరుగుతుంది అన్నాడు. మరికొన్ని రోజులకు ఆ దేశంలో యుద్ధం మొదలైంది. పొరుగు దేశం వారు దాడి చేశారు. దాంతో రాజు ఒక్కో ఇంట్లోంచి ఒక యువకుడు తప్పనిసరిగా యుద్ధ భూమికి తరలి రావాలని ఆదేశాలు జారీ చేశాడు. అయితే జట్కావాలా కొడుక్కి కాలు విరగడం వల్ల యుద్ధానికి వెళ్ళవలసిన అవసరం తప్పింది.

పైగా జట్కావాలా వృద్ధుడయ్యాడు. కనుక అతను కూడా యుద్ధానికి వెళ్ళక్కర్లేదు.

ఈ స్థితిలోనూ అతను జరిగేది జరుగుతుందని తన పనులు తాను చూసుకుంటున్నాడు.

.............

ఇది ఒక కథ. ఇంట్లో పూర్వం బామ్మలు చెప్పిన కథలలో ఇదొకటి.


కథ అదోలా అనిపించినా మనం తెలుసుకోవలసిన విషయం ఒకటుంది. జీవితంలో సుఖదుఃఖాలు అనేవి ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉంటాయి. వాటన్నింటికీ అలవాటు పడాలి. అంతే తప్ప సుఖమొచ్చినప్పుడు ఎగిరి గంతులు వేయక్కర్లేదు. దుఃఖమొచ్చినప్పుడు డీలా పడక్కర్లేదు. స్థితప్రజ్ఞుడిలా ఉండాలన్న మాట.

ఓ గుర్రప్పందెం జరుగుతోంది. ఒకడు ఓ గుర్రం మీద డబ్బులు కట్టాడు. కానీ అది గెలవలేదు. పక్కనున్నవాడు "నువ్వు డబ్బులు కట్టావు కదా ఆ గుర్రం పరుగెత్తనేలేదు. నడుచుకుంటూ వెళ్ళింది. అందుకే నువ్వు కట్టిన డబ్బులు పోగొట్టుకున్నావని" చెప్పాడు.

దానికతను "జరిగేది జరగకమానదు అన్నాడట".



# అందాయి



**బాలచెలిమి**
విద్యార్థులు రాసిన కథలు
సంపాదకులు: మణికొండ వేదకుమార్; ప్రతులకు: భూపతి సదన్, 3-6-716, స్ట్రీట్ 12, హిమాయత్ నగర్, హైదరాబాద్-29

**కుమార్తెకు ప్రేమతో... నాన్న**
రచయిత: జాలాది రత్నసుధీర్
ప్రతులకు: జాలాది రత్నసుధీర్, 8-3-229/డబ్ల్యు/16, 501 సాయికృష్ణ టవర్స్, హైలెమ్ కాలనీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-45.

**శ్రీ సీతారామ కథోత్సాహ తారావళి**
రచయిత: డా॥ ఆచార్య ఫణీంద్ర
ప్రతులకు: జి.సావిత్రి, 6-34/48/1, బాలాజీ నగర్ కాలనీ, హైదరాబాద్-83

**ధనలక్ష్మీ ఆహ్వానం**
రచయిత: పూర్ణచందర్ రావు
403, స్నోడ్రాప్ అపార్ట్‌మెంట్, ఆంజనేయనగర్, మూసాపేట్, హైదరాబాద్-18.

**కిశోర గాంధీయం**(వచన కవిత్వం)
రచయిత: గజ్జారాం చట్ల
ప్రతులకు: చట్ల గజ్జారాం
1-4-130/3, ఆదర్శ్ నగర్, నిర్మల్-504 106.

**సీరపాణి**
**డమరుధ్వని-ప్రతిధ్వని**
రచయిత: పిల్లా తిరుపతి రావు
(కవిత్వ విశ్లేషణ)
ప్రతులకు: పిల్లా జానకి
పిల్లా వీధి, ఎ.కంచరామ్
విజయనగరం జిల్లా-532 127.

**చంద్రోదయము**
రచయిత: అల్వాల లక్ష్మణమూర్తి
ప్రతులకు: అల్వాల లక్ష్మణమూర్తి
సుభాష్‌నగర్, టీచర్స్ కాలనీ, 3-143/డి, కల్వకుర్తి
నాగర్‌కర్నూల్ జిల్లా-509324

**ఎరుపు(అసి కవితలు)**
రచయిత:సింగంపల్లి అశోక్‌కుమార్
ప్రతులకు: 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతి నగర్, విజయవాడ-520 004.

---


**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
సెల్: 9885446501/9885449458





# ఈశాన్య దోషం అంటే ఏమిటి?

(గత వారం తరువాయి)

ఇక రెండవ విషయం..

దోషమంటే ఏమిటంటే- ఈశాన్య మూలన ఉండకూడనివి ఉండటం. ఈశాన్యం మూలలో సాధారణంగా వాస్తు నియమం ప్రకారం ఏమీ ఉండకూడదు. ఖాళీగా ఉండాలి. కానీ ఈశాన్యం మూలన ఉండకూడనివి ఏమైనా ఉన్నప్పుడు అది తీవ్రమైన ఈశాన్య దోషం అవుతుంది. ఈశాన్యం కార్నర్‌లో అనేక రకాల బరువులు పెట్టడం, చీపురు, గునపాలు, పారలు, ఇనుప వస్తువులు, చెప్పులు, మురికి బట్టలు, రకరకాల కత్తులు, ఆయుధాలు, బండ రాళ్లు మొదలైనవి తెలిసో, తెలియకో పెట్టటం వలన ఈశాన్య దోషం ఏర్పడుతుంది. ఇంటికి ఉన్న ఖాళీ ఆవరణలో ఈశాన్య మూలన కూడా ఇట్లాంటివి పెట్టడం వలన ఈశాన్య దోషం ఏర్పడుతుంది.




అలాగే ఈశాన్య మూలన ఏదైనా ఒక చిన్న ఉపగృహాన్ని నిర్మించటం, ఒక స్టోర్ రూమును నిర్మించటం లేదా ఒక టాయిలెట్‌ని, బాత్ రూమ్‌ని నిర్మించడం... ఇలాంటి వాటి వలన ఈశాన్య దోషం ఏర్పడుతుంది.

ఈ విధమైన దోషాలు ఉన్నప్పుడు, దీనికి తూర్పు ఈశాన్యం వీధి చూపు ఉన్నప్పటికీ మంచి ఫలితాలు రావటం అటుంచి, చెడు ఫలితాలు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది. దాని వల్ల అనేక బాధలు అనుభవంలోకి వస్తుంటాయి. అందుకని ఈశాన్య దోషం, ఈశాన్య లోపం లేకుండా చూసుకోవాలి. ఈ దోషాలు, లోపాలు లేనప్పుడు సాధారణంగా ఒక గృహం మంచి ఫలితాలే ఇస్తుంది. ఈ దోషాలు, లోపాలు ఉన్నప్పుడు ఏ గృహమైనా మంచి ఫలితాలు ఇవ్వదు.

ఇక్కడ "కాంబినేషన్" ఏమిటంటే... 1) ఈ లోపాలు, దోషాలు లేకుండా, ఈశాన్య వీధి చూపు అద్భుతమైన ఫలితాలనిస్తుంది.

2) ఈ లోపాలు, దోషాలు ఉన్నప్పుడు, తూర్పు ఈశాన్య వీధి చూపు ఉన్నప్పటికీ ఆ ఇల్లు మంచి ఫలితాలను ఇవ్వదు.

అవి అంటుడు మిద్దెలు(రో హౌసెస్) కావచ్చు, ఇండిపెండెంట్ హౌసెస్ కావచ్చు, స్థలాలు, ఫ్యాక్టరీలు, ఆఫీసులు, గిడ్డంగులు మొదలైనవి ఏవైనా సరే.. ఈశాన్యం వీధి చూపు ఉన్నప్పుడు... ఈశాన్య దోషం, ఈశాన్య లోపం లేకుండా వీధి చూపును చక్కగా వినియోగించుకో గలిగితే, సులభంగా ఉన్నతమైన ప్రమాణాలతో జీవించగలుగుతారు. సజావుగా వ్యాపార, వ్యవహారాలు కొనసాగించగలుగుతారు. సంపదలు, పేరు ప్రతిష్టలు ఇవన్నీ కోకొల్లలుగా వచ్చి పడుతూ ఉంటాయి. ఈ విషయం తెలిసి ఉంటే వాస్తు జాగ్రత్తలు తీసుకోగలుగుతాం. ఇటువంటి నివాసంలో ఉండే అవకాశం వచ్చినప్పుడు ఈ అవగాహన ఎంతో సహాయపడుతుంది.

తూర్పు ఈశాన్యం వీధిచూపు ప్రభావాన్ని ఏ విధంగా చక్కగా ఉపయోగించుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలో తెలుస్తుంది, ఏ విధమైన మీమాంస ఉండదు.

---

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్త'లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు : ........................................
పుట్టిన తేది : ........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............
చిరునామా:..............................................

# వన్య ప్రాణుల సంరక్షణ-ఆవశ్యకత

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

మనిషికి ఊపిరితిత్తులు ఎంత ముఖ్యమో భూగోళ పర్యావరణానికి అటవీ సంపద అంతే ప్రధానం. అటవీ సంపదలో దట్టమైన హరిత సంపదలు, అందులో అంతర్భాగమైన జీవజాతులు లేదా వన్యప్రాణులు వస్తాయి. అడవుల్లో ఉండే జంతు వృక్షజాలం మానవాళికి వెలకట్టలేని మేలును చేస్తోంది. మానవ ప్రమేయం లేకుండా స్వతంత్రంగా అడవులలో జీవించే వృక్ష జంతుజాలాన్ని వన్యప్రాణులుగా పిలుస్తారు.

వన్యప్రాణుల్లో భారీ ఏనుగులు, జిరాఫీలు, రైనోలతో మొదలు పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు వస్తాయి. 1952లో ఏర్పాటు చేసిన భారత "జాతీయ వన్యప్రాణుల మండలి" చొరవతో వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 తీసుకువచ్చి దేశ వ్యాప్తంగా వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయి.

దేశ వ్యాప్తంగా వన్యప్రాణులను అటవీ సంపదగా కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పదిలపరుచుకోవాలనే అవగాహన సమాజంలో కల్పించడానికి ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంధ కార్యకర్తలు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

## ప్రపంచ వన్యప్రాణ వారోత్సవం

వన్యప్రాణి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించే సదుద్దేశంతో ప్రతి ఏటా భారత ప్రభుత్వం అక్టోబర్‌లో "ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాల"ను ప్రతిష్టాత్మకంగా చేబడుతున్నది. అడవుల నరికివేతను కట్టడి చేస్తూ, జాతీయ ఉద్యానవనాలు, జీవావరణ విలువలు, వన్యప్రాణి అభయారణ్యాలు ఏర్పాటు చేయడం ద్వారా జీవ వైవిధ్యం కాపాడబడి, పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి.

## ప్రపంచ వన్యప్రాణ సంపద

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి యేటా సుమారు ఐదు వేలకు పైగా రకాలైన జీవజాతులను స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా విక్రయిస్తున్నారని తెలింది. వన్యప్రాణుల పరిరక్షణతోనే జీవ వైవిధ్యం నెలకొంటూ, కాలుష్యం తగ్గించబడి, పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుంది.

వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ నేతృత్వంలో సదస్సులు, సమావేశాలు, కార్యశాలలు, పలు రకాలైన పోటీలు, గోడ పత్రికల విడుదల, వీధి నాటికలు, జంతు, పక్షుల ప్రదర్శనశాల (జూలు) సందర్శనలు, వన సందర్శనలు, వన మహోత్సవాలు, వన్యప్రాణి పుస్తక పఠనం, వన్యప్రాణుల వీడియోలు చూపించడం, స్వచ్ఛ భారత్, పర్యావరణ వేత్తలతో ముఖాముఖి లాంటి వేదికల ద్వారా ప్రజలకే కాకుండా విద్యార్థి లోకానికి వన్యప్రాణుల పరిరక్షణ అవసరాన్ని వివరిస్తారు. ఈ వారోత్సవాలలో వన్యప్రాణి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, చట్టాల అమలులో పటిష్టత, అవసరమైన నూతన చట్టాల రూపకల్పన, జీవ సంరక్షణ అవసరం, అభాయారణ్యాల ఏర్పాటు, జాతీయ ఉద్యానవనాల స్థాపన, అడవుల నరివేతను వ్యతిరేకించడం వంటి అంశాలలో లోతైన చర్చలు జరుగుతుంది.



## భారత వన్యప్రాణుల సంపద

ఇండియా అడవుల్లో 91,797 రకాలైన జంతుజాతులు, 46,340 రకాల వృక్షజాతులు ఉన్నాయి. వీటికి తోడుగా 2,634 రకాల చేపల జలజాతుల సంపద మన దేశంలో ఉన్నది. ప్రపంచంలోని జీవజాతుల్లో 80 శాతం వరకు జీవ వైవిధ్యం కలిగిన జంతు సంపద మన దేశంలోనే ఉంది. వీటిలో క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాలు.. లాంటి జీవుల అపార సంపద మన అడవులకు, మానవాళికి ఎనలేని సేవలందిస్తున్నాయి.

ఉత్తరాన హిమాలయాల నుండి దణాన కేరళ అడవుల వరకు అపార జీవ వైవిధ్యంతో అటవీ గొర్రెలు, మేకలు, పులులు, చిరుతలు, అడవి దున్నలు, గేదెలు, అటవీ పిల్లులు, జింకలు, లంగూర్స్, కోతులు, గాడిదలు, ముళ్ళపందులు, దుప్పులు, కుందేళ్లు, నక్కలు, ముంగీసలు, హైనాలు, గబ్బిలాలు, కుక్కలు, పలు రకాల పాములు, మొసళ్ళు, ఒంటెలు, ఏనుగులు, సింహాలు, తాబేళ్లు, బల్లులు, వైవిధ్యభరిత రెండు వేల రకాల పక్షులు, ఖడ్గమృగాలు, అపార క్రిమికీటకాలు లాంటి అసంఖ్యాక జంతుజాలం మన అడవుల సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.



మన జాతీయ జంతువుగా టైగర్, జాతీయ పక్షిగా నెమలి గుర్తించబడ్డాయి. మన దేశంలో అనేక అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, అడవులు ఉన్నాయి. టైగర్ ప్రాజెక్ట్ పథకంలో భాగంగా 21 టైగర్ రిజర్వులు నిర్వహించబడుతున్నాయి. అతి పెద్ద జీవ వైవిధ్యం కలిగిన పన్నెండు దేశాలలో భారత్ ఒకటిగా పేరు తెచ్చుకుంది. మన దేశంలోని ఈస్టర్న్ హిమాలయాలు, వెస్టర్న్ ఘాట్స్ అంతర్భాగంలో ప్రపంచపు 20 శాతం జంతుజాలం ఉంది. ఇండియాలో 3.64 శాతం భారత భూభాగంలో 1.2 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధితో



553 అభయారణ్యాలు ఉన్నాయి.

## ప్రయోజనాలు

స్వార్థపూరిత మానవుడు వ్యాపారం పేరుతో పలు రకాలైన క్షీరదాలు, సరీసృపాలు, పక్షులు, చేపలను వేటాడుతూ, జీవ వైవిధ్యానికి ఎనలేని నష్టాన్ని కలిగిస్తున్నాడు. జీవ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు, ఆహార, చక్ర గమనానికి, జీవ వైవిధ్య పరిపుష్టికి, వృక్షరాజ్య విస్తరణకు, పర్యావరణ శుద్ధికి, వన్య జంతువు సంతాన స్థిరాభివృద్ధికి, పలు రకాలైన కాలుష్యాల కట్టడికి, వృక్ష జంతుజాలల వైవిధ్యానికి కాపాడటానికి, పర్యాటక రంగ అభివృద్ధికి, క్రీడలు (ఫిషింగ్, వేట) పరిశోధనలు మెదలైన అంశాలకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గమనించాలి. వన్యప్రాణుల పరిరక్షణతో పలు ఆటవీ ఉత్పత్తులైన ఔషధాలు, తేనె, పట్టు, వెంట్రుకలు, ఈకలు, తోలు, చర్మాలు, దంతాలు (చనిపోయిన తరువాత) వంటివి లభిస్తాయి. వన్యప్రాణుల నుండి వంట చెరుకు, కలప, పండ్లు, కాయలు, పువ్వులు, జిగురు లాంటి ఉత్పత్తులు కూడా ప్రత్యేక్షంగా లభిస్తాయి. మన సంస్కృతిలో భాగంగా ఏనుగు శిరస్సు గల గణపతి వెంట ఎలుక, దుర్గమాత వెంట పులి, సరస్వతి వెంట నెమలి, శ్రీరాముని వెంట వానరులు, ధైర్యసాహసాలకు ప్రతీకగా సింహం, శివుని మెడలో నాగుపాము వంటి జంతువుల సాహచర్యంతో వన్యప్రాణి ప్రాముఖ్యతలను ఆధ్యాత్మిక పాఠంగా బోధిస్తున్నాయి.

## సవాళ్లు

వన్యప్రాణులతో మానవాళికి ప్రాణభయం, వాహనాల ధ్వంసం, సాధుజంతులపై దాడి, పంటచేను విధ్వంసం, క్రిమికీటకాలతో పంట తెగుళ్ళు వంటి నష్టాలు కూడా ఉన్నాయి. అడవుల నరికివేత, పోడు వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు (అడవులు కాలిపోవడం, భూకంపాలు, వరదలు, తీవ్ర కరువు), పారిశ్రామికీకరణ, డ్యాముల నిర్మాణం, రోడ్లు వేయడం, రైలు మార్గాలు.. లాంటి కారణాలతో అటవీ జంతు జాలానికి ప్రమాదం పొంచి ఉన్నది.

## ప్రముఖ జాతీయ ఉద్యానవనాలు

వన్యప్రాణి సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన జాతీయ ఉద్యానవనాలలో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పులుల రక్షణ పార్క్, యూపీలోని దుద్వా కోతుల పార్క్, గుజరాత్లోని సింహాల ఘీర్ పార్క్, యంపీలోని కన్హా జింకల, శివపురి వోల్ఫ్ పార్కులు, ఒడిస్సాలోని సిమిలిపాల్ పులుల పార్క్, సుందర్బన్, మానస్ లాంటి అనేక జాతీయ



ఉద్యానవనాలు జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. వీటితో పాటు మన దేశంలో వన్యప్రాణి అభయారణ్యాలుగా డచిగమ్ (జమ్ముకాశ్మీర్), రాజాజీ (ఉత్తరాఖండ్), రాథంబోర్, సరిస్కా(రాజస్థాన్), కవల్(మహారాష్ట్ర), చండకా(ఒడిసా), పోచారం ఎటూరా నాగారం(తెలంగాణ), బండీపూర్ (కర్నాటక), గిండీ, మధుమలై (తమిళనాడు), పెరియర్ (కేరళ) వంటివి పేరొందాయి. భారత్‌లో పులులు, ఏనుగులు, తాబేళ్ళు, మొసళ్లను కాపాడేందుకు అటవీ ప్రాజెక్టులు ఉన్నాయి.

## వన్యప్రాణి సంరక్షణ మార్గాలు

అంతరించే ప్రమాదంలో ఉన్న జంతువుల ఆవాసాలను కాపాడడం, అక్రమ వేటను అరికట్టడం, పోడు వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు వెదకడం, జాతీయ ఉద్యానవనాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకం.

అభయారణ్యాల నిర్వహణ, ఫారెస్ట్ రిజర్వుల అజమాయిషీ, అటవీ చట్టాలను కఠినంగా అమలు చేయడం, అక్రమ అడవుల నరికివేతను అడ్డుకోవడం, అడవుల్లో మానవ రవాణ వ్యవస్థలను చేపట్టకపోవడం, విపత్తులో ఉన్న జీవ జాతుల పునరుత్పత్తికి చర్యలు తీసుకోవడం అవసరం.

అడవుల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం లాంటి చర్యలు చేపట్టడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు బీజాలు పడతాయి. వనానికి అందాన్నిచ్చే దట్టమైన వృక్షాలు, అనేక రకాల జంతు జాతులు సకల మానవాళికి జీవవైవిధ్యం కల్పిస్తూ అపూర్వ సేవలు అందిస్తున్నాయి. భూమిని నివాస యోగ్యం గ్రహంగా కాపాడుకున్నపుడే భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర వాతావరణంలో నివసించగలుగుతారు.

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

ఆలయదర్శనం

# మహా పాశుపత బంధ ఆలయాలు

**మనకి తెలియదుగానీ మన రాష్ట్రంలో అనేక పురాతన ఆలయాలు గ్రామ గ్రామాన కనిపిస్తాయి. కానీ స్థానికులకు కూడా ఆయా ఆలయాల చరిత్ర తెలియదు అంటే ఆశ్చర్యం కలుగుతుంది. జీవనదులైన గోదావరి, కృష్ణా నదీతీరాలు అనేక దివ్య ధామాలకు నెలవని చెప్పవచ్చు.**

గత కొంతకాలంగా సేకరించిన సమాచారం, సందర్శించిన ఆలయాల ఆధారంగా కొన్ని విశేష ఆలయాల గురించి తెలుసుకుందాం.

ఆంధ్రరాష్ట్రంలో పావన కృష్ణవేణి అధిక శాతం గుంటూరు, కృష్ణా జిల్లాలలో ప్రవహిస్తుంది.

ఈ రెండు జిల్లాలలో నదీ తీరాలలో కొన్ని వందల సంవత్సరాల నాటి ఆలయాలు దర్శనమిస్తాయి. ప్రతి గ్రామంలోనూ ఒక శివ, ఒక విష్ణు ఆలయం కనిపించడం నాటి పాలకుల సమదృష్టికి నిదర్శనంగా చెప్పుకోవాలి.

## చరిత్ర

వెయ్యి సంవత్సరాల క్రితం శైవం, వైష్ణవం తప్ప మరో మతం లేదు కదా మన దేశంలో!

గతంలో ఈ ప్రాంతాలు ఆనంద గోత్రీకులు, చోళులు, వెలనాటి చోళులు, వేంగి చాళుక్యులు, కాకతీయ, శాతవాహన, రెడ్డి రాజులు, విజయనగర రాజులు పరిపాలించారు.

వీరిలో రెండవ శతాబ్దానికి చెందిన ఆనంద గోత్రీకులు నిర్మించిన కొన్ని విశేష ఆలయాలు కాలక్రమంలో మార్పులు చెంది కొంత నేటి ఆధునికతను సంతరించుకొని కనిపిస్తాయి. వీరి పాలనా కాలం నాలుగవ శతాబ్దంగా చరిత్ర కారులు పేర్కొంటున్నారు.



చోళులు, చాళుక్యులు బంధువులుగా మారిన తరువాత తమ సామ్రాజ్యంలో ఆలయం లేనిచోట కొత్త ఆలయాలు నిర్మించారు. శిథిలావస్థలో ఉన్న గ్రామాలలోని ఆలయాలను పునః నిర్మించారు అని శాసనాల వల్ల తెలుస్తోంది. వీరి పాలనా కాలం ఏడు నుండి పన్నెండవ శతాబ్దాల మధ్య.

వీరి తరువాత ఈ ప్రాంతాలను తమ యేలుబడిలోనికి తెచ్చుకొన్న రాజ వంశాలవారు ఈ క్షేత్రాలను సందర్శించడమే కాకుండా ఈ ఆలయాలకు అనేక విలువైన మణిమాణిక్యాలు, ధనం భూములు దానంగా సమర్పించుకున్నారు.



చివరగా అమరావతిని పాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు శిథిలావస్థలో ఉన్న అనేక ఆలయాలను పునః నిర్మించి భూములు ఇచ్చారని తెలుస్తోంది. గత రెండు శతాబ్దాలుగా స్థానిక భక్తులు ఆలయ నిర్వహణ, అభివృద్ధి, నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు.

ప్రస్తుతం ఈ ఆలయాలు అన్నీ దేవాదాయ ధర్మాదాయ శాఖవారి నియంత్రణలో ఉన్నాయి.

## పౌరాణిక గాథ

ఆది దంపతుల వివాహ సందర్భంగా భూ ఉత్తర భాగంలో జనసందోహం ఎక్కువ కావడాన పరమేశ్వరుడు అగస్త్య మహర్షిని శిష్యప్రశిష్యులతో కలిసి దక్షిణానికి వెళ్ళమని ఆదేశించారట. వారి కళ్యాణం ఎక్కడ నుండి అయినా వీక్షించే వరాన్ని కూడా ఇచ్చారట.

అగస్త్య మహర్షిని మహర్షిని దక్షిణ భాగానికి పంపడానికి మరో లోకకల్యాణ కారణం కూడా ఉన్నది. అదేమిటంటే వింధ్య పర్వతరాజు మేరు పర్వతం కన్నా గొప్పవాడిని అనిపించుకోవాలని విపరీతంగా పెరగసాగాడట. దాని వలన లోకాలకు వెలుగును ప్రసాదించే సూర్యచంద్రుల గమనానికి అవరోధం ఏర్పడసాగిందిట.

వింధ్యుడు అగస్త్య మహర్షి శిష్యుడు. ఆయన మాట విని అతను తగ్గుతాడు అన్న విశ్వాసం కూడా మరో కారణం.

మహేశ్వరుని ఆనతితో దక్షిణానికి బయలుదేరిన అగస్త్య మహర్షి తనకు శిరస్సు వంచి నమస్కరించిన వింధ్యుని తాను తిరిగి వచ్చేవరకు అలానే ఉండమని చెప్పడంతో తిరిగి సూర్యచంద్రుల గమనం సజావుగా సాగసాగింది.

దక్షిణ భారతానికి వచ్చిన మహాముని తాను విడిది చేసిన ప్రతి తీర్థ క్షేత్రంలో నిత్యపూజల నిమిత్తం శివలింగాన్ని ప్రతిష్ఠించేవారట. గమనిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో చాలా ఆలయాలలో పూజలు అందుకొనే లింగరాజును శ్రీ అగస్త్యేశ్వర స్వామి అని పిలవడం గమనార్హం.

మన రాష్ట్రంలో ముఖ్యంగా కృష్ణాతీరంలో శ్రీ అగస్త్యేశ్వర స్వామి కొలువైన ఆలయాలు చాలా కనపడతాయి.

అనంతర యుగాలలో అవతార పురుషులు, మహర్షులు, పాలకులు ఈ ఆలయ అభివృద్ధికి పాటు పడ్డారని గాథలు తెలుపుతున్నాయి.

## మహాపాశుపత బంధ ఆలయాలు

వీటిని "త్రిలింగ క్షేత్రాలు" అని కూడా పిలుస్తారు. ఇవి మొత్తం నాలుగు. అవి గుంటూరు జిల్లాలోని తెనాలికి చుట్టుపక్కల నెలకొని ఉన్నాయి. ఈ నాలుగు దేవాలయాలను శ్రీ అగస్త్య మహర్షి ప్రతిష్ఠించారు.

మాయా జూదంలో ఓడిపోయిన పాండవులు నిబంధనలకు బద్ధులై అరణ్యవాసం చేస్తున్నప్పుడు శ్రీకృష్ణుడు వారి వద్దకు వచ్చి కురు పాండవ యుద్ధం అనివార్యం అని, భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణ లాంటి వీరులను ఓడించడానికి అర్జునుడు నూతన ఆయుధాలను సమకూర్చుకోవలసిన అవసరం గురించి చెప్పారు.

ఆయన మాట మీద పార్థుడు కృష్ణా తీరంలోని ఇంద్రకీలాద్రి వద్ద పశుపతినాథుని గురించి తీవ్రమైన తపస్సు చేసాడట. అతని భక్తిశ్రద్ధలు, పోరాట పటిమను పరీక్ష చేయడానికి ఆదిదంపతులు కిరాతక వేషాలలో వచ్చారట.

ఆ సమయంలో ఈ ప్రాంత ప్రజలను 'మూకాసురుడు' అనే రాక్షసుడు పంది రూపంలో ఇక్కట్లు పెడుతున్నాడు. అసురుడు శివ భక్తుడు. అయినా లోకకంటకుడు అయినందువల్ల లయకారుడు అతనిని ఫల్గుణి తపస్సు భగ్నం చేయమని ఆదేశించారు.

చికాకు పెడుతున్న వరాహం మీద ఆగ్రహంతో గాండీవి బాణాలను సంధించారట. సరిగ్గా అప్పుడే వేటగాని రూపంలో ఉన్న పినాకపాణి కూడా బాణాలను సంధించారట. మూకాసురుడు మరణించాడు. కానీ వానిని సంహరించింది నేనంటే నేను అని కుంతీపుత్రుడు, త్రినేతుడు వాదన పెట్టుకొని చివరకు యుద్ధం చేశారు.



ఎంతకీ తెగని యుద్ధం దేవతల ప్రార్థన మేరకు ఆగింది, పార్థుని ప్రతాపానికి సంతసించిన నందివాహనుడు అతనికి పాశుపతాస్త్రంతో సహా అనేక అస్త్రాలను ప్రసాదించారన్నది పురాణగాథ.

ఈ ఉదంతాన్ని తీసుకొని ఆరవ శతాబ్దానికి చెందిన "భారవి" అనే కవి "కిరాతకార్జునీయం" రచించారు. సంస్కృత రచనలలో ప్రథమ పంక్తిలో ఉన్న గ్రంథాలలో ఇది ఒకటి. అనంతర కాలంలో కవి సార్వభౌముడు శ్రీనాథుడు ఇదే పేరుతో తెలుగులో రచించారు.

అర్జునుడు తపస్సు చేసిన ఇంద్రకీలాద్రి అమ్మలకన్నమ్మ శ్రీ కనక దుర్గమ్మ శ్రీ మల్లేశ్వర స్వామితో కొలువైన క్షేత్రం. పర్వత పాదాల వద్ద శ్రీ విజయాలేశ్వర స్వామి ఆలయం ఉంటుంది. స్వామిని అర్జునుడు ప్రతిష్ఠించారనీ. అందువల్ల ఆయన పేరుతో స్వామిని పిలుస్తున్నారు అని క్షేత్ర గాథ తెలుపుతోంది.

ఈ ఆలయంలో ఉన్న శ్రీ బ్రహ్మాస్త్రాదేవి సన్నిధి ఈ ఉదంతానికి బలాన్ని ఇస్తోందా విజయుడు వేటగాని రూపంలో వచ్చిన గంగాధరుని వద్ద పొందిన అస్త్రాలలో ఈ త్రిలింగ క్షేత్రాలలో కొలువైన లింగేశ్వరుని శక్తి కలిసిందన్నది స్థానికంగా వినిపించే విషయం. ఎక్కుపెట్టిన విల్లు రూపంలో ఉండే ఈ నాలుగు ఆలయాలు వరుసగా కొలకలూరు, నందివెలుగు, ఈమని, దుగ్గిరాల. ఇదే వరుసలో ఆలయాలను సందర్శించాలి అన్న నియమం కూడా ఉన్నది.

కొలకలూరు ధనుస్సు పైభాగం కాగా, ఈమని కింది భాగం, నందివెలుగు విలుకాడు ధనుస్సును పట్టుకొనే మధ్యభాగం. ఇక వింటినారి సారించి శరాన్ని లక్ష్యం మీదకు సంధించే మహా కుండలినీ క్షేత్రం దుగ్గిరాల.

కొలకలూరు చంద్రకళ, నందివెలుగు అగ్నికళ, ఈమని సూర్యకళల శక్తిని అర్జునుడు పొందిన దివ్యాస్త్రాలకు అందించాయని చెబుతారు.

ఈ శక్తులను ఒకటిగా సమ్మిళితం చేసి కుండలినీ క్షేత్రం అయిన దుగ్గిరాలలోని శ్రీనాగేశ్వర స్వామి ఆలయం నుండి ఇంద్రకీలాద్రికి సంధించబడినది అన్నది పురాణగాథ. ఆలయాల్లో ఉండే శిలా ఫలకాల మీద చిత్రం కనపడుతుంది.

మంగళగిరి నుండి తెనాలి వెళ్లే మార్గంలో వచ్చే ఈ ఆలయాలు మొత్తం సుమారు ఇరవై కిలోమీటర్ల పరిధిలో నెలకొని ఉంటాయి. దుగ్గిరాలలో కొలువైన స్వామిని శ్రీ నాగేశ్వర స్వామి అని పిలుస్తారు. మిగిలిన మూడు క్షేత్రాలలో శ్రీ అగస్త్యేశ్వర స్వామి కొలువై ఉంటారు.

ప్రతి క్షేత్రంలో శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ రామచంద్రమూర్తి పేర్లతో శ్రీ మహావిష్ణువు కొలువైన పురాతన ఆలయాలు సైతం ఉండటం విశేషంగా చెప్పుకోవాలి. స్వంత వాహనంలో అయితే విజయవాడ లేదా గుంటూరు నుండి ఈ ఆలయాలను సులభంగా చేరుకొని సందర్శించుకోవచ్చు.

గుర్తుపెట్టుకోవలసిన విషయం ఏమిటంటే– ఉదయం ఆరు నుండి పదకొండు గంటలలోపు ఈ నాలుగు ఆలయాలను సందర్శించడం మంచిది. గ్రామాలలో ఉన్న ఆలయాలు కనుక తొందరగా మూసివేస్తారు. ■

– ప్రతికూలత ప్రయోజనాలు మధురంగా ఉంటాయి. చాలామంది ప్రతికూలతను భరించగలరు కానీ తిరస్కారాన్ని మాత్రం భరించలేరు. ప్రతికూలతను మించిన విద్య లేదు.

– మనిషి పాతబట్టలు ధరించినా పరవాలేదు కానీ కొత్త పుస్తకాలు మాత్రం కొంటూ ఉండాలి.

**జనవరి 12, 2025 నుండి జనవరి 18, 2025 వరకు**

# వారఫలం




**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795




## మేషం

ఈ వారం పెట్టుబడులకు సంబంధించిన విషయాలు వ్యవహారాలు మనస్ఫూర్తిని కలిగిస్తాయి. మీకు భాషా పరిజ్ఞానం లేదని లేదా కొన్ని అంశాల పట్ల అవగాహన లేదని కొంతమంది చులకన చేసే అవకాశం ఉన్నది. ఇట్టి వాటికి తావివ్వకుండా మీరు నేర్చుకోగలిగితే అన్నింటా విజయాన్ని సాధించగలుగుతారు. నూతన విద్యల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. నేర్చుకునే అవకాశాలు గ్రహస్థితులు సూచిస్తున్నాయి. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి.



## వృషభం

ఈ వారం ఎవ్వరి మీద ఆధారపడకుండా మీరు తీసుకునే నిర్ణయాలు ఎంతగానో మేలు చేస్తాయి. జీవిత భాగస్వామి సలహాలు సూచనలు మీకు అక్కరకు వస్తాయి. వృత్తి రీత్యా స్వల్పమైన ఒడుదుడుకులు ఏర్పడతాయి. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. క్రయవిక్రయాలలో లాభాల అందుకో గలుగుతారు. దూర ప్రాంతాల్లో పెట్టుబడులకు తగిన సమయం. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి ఉంటారు. వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు కొనిస్తారు.



## మిథునం

ఈ వారం బహుమతులుగా ఇవ్వాలన్న ఆలోచనలు ముడిబడతాయి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. కళ్ళకు చక్రాలు కట్టుకొని మరి పనిచేస్తారు. ప్రయోజనాలను కోల్పోకూడదు మన పిల్లలకి దక్కాలి అని భావిస్తారు, శుభవార్త వింటారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది. విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. వైద్య విద్య పట్ల మక్కువ చూపిస్తారు.



## కర్కాటకం

ఈ వారం పలువురి మెప్పును పొందుతారు. దీర్ఘకాలిక ఆశయాలను దృష్టిలో ఉంచుకొని ఈరోజు నుంచి నెమ్మదిగా పొదుపు పథకాలు ప్రారంభిస్తారు. స్నేహితుల సహాయము అందుకుంటారు. జీవిత భాగస్వామి పట్ల ప్రేమ అనురాగం కలిగి ఉంటారు. కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయడండి. ప్రయోజనాలని అందుకుంటారు. వైద్య విద్య పట్ల మక్కువ చూపిస్తారు. శుభవార్తలు వింటారు, కుటుంభం పురోగతి బాగుంటుంది.



## సింహం

ఈ వారం వాహనాలు కొనుగోలు అమ్మకాల విషయాలు అనుకూలంగా ఉంటాయి. భుసంభంధిత లావాదేవీలు లాభిస్తాయి. అష్టమూలికా తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. నడుము నొప్పి ఇబ్బంది పెడుతుంది. కొన్ని రోజులు ఉద్యోగానికి సెలవు తీసుకుంటారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. వివాహాది విషయ వ్యవహారాలు ముడిబడతాయి.



## కన్య

:ఈ వారం ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. కుక్కలకు జీవరాసులకు మంచినీళ్లను పెట్టండి. రహస్య మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులను అందిస్తారు. బంధువులతో సమస్యలు ఏర్పడతాయి.



## తుల

ఈ వారం పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. గణితం విద్య, వైద్య విద్య, ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన ఉద్యోగ అవకాశాల కోసం చేసే దరఖాస్తులు, ఇంటర్వ్యూ , ఫలిస్తాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంది. కొద్దిపాటి ఒత్తిడిని కూడా భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. శారీరికంగా బలహీనత ఈ పరిస్థితికి కారణం అవుతుంది.



## వృశ్చికం

ఈ వారం కొత్త ఆలోచనలు , ప్రణాళికలు రూపొందిస్తారు. మీ ప్రతిభ పాటవాలను వెలుగులోకి తీసుకు వస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల సంఘసేవ కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు . దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి . జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి. కొన్ని సందర్భాలలో నిజాలు మాట్లాడుకోలేని పరిస్థితిని నెలకుంటాయి.



## ధనస్సు

ఈ వారం కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సహొద్యోగులతో భేదాభిప్రాయాలు చోటు చేసు కుంటాయి. మీ మానసిక స్థితిని అర్ధం చేసుకోగలిగిన వారు నిజంగా ఎవరు అనేది ఈ వారం తెలుసుకోగలుగుతారు. నరదృష్టి అధికంగా ఉంటుంది. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. సంఘంలో కీర్తి పెంపొందుతుంది. జాయింట్ వ్యవహారములో వివాహ సంబంధములో అనుకోని వ్యక్తి సహకరిస్తాడు.



## మకరం

ఈ వారం విదేశీయాన ప్రయత్నాలు, విదేశాలలోని ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు బాగుంటుంది. పరపతి కలిగిన వారి తోటి పరిచయాలు మేలు చేకూరుస్తాయి. నిత్యం సిద్ధ గంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పూజించండి. లలితకళలలో ప్రావీణ్యతను పొందడానికి శిక్షణా తరగతులలో చేరతారు. మంచి మధ్యవర్తిగా వ్యవహరించి ఇరువర్గాల మధ్యన సంఖ్యతను సమకూరుస్తారు. జీవితాన్ని కొత్త కోణంలో చూస్తారు. వృత్తి, ఉద్యోగ వ్యాపారాది విషయాలు మీరు ఆశించిన స్థాయిలో ఉండటం మీ మానసిక సంతోషానికి కారణమవుతాయి.



## కుంభం


ఈ వారం రాజకీయాలు ఆకర్షిస్తాయి పలువురితో పరిచయాలు అందుకు కారణం అవుతుంది. స్వల్పమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రయోజనాలని అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరం తో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. శనీశ్వరాలయంలో తైలాభిషేకం జరిపించండి నలుపు వత్తులతో నువ్వుల నూనెతో దీపారాధన చేయండి.




## మీనం

ఈ వారం సాంకేతిక విద్యలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురు కాగలవు. వాహనం, స్థలాలు కొనుగోలు యత్నాలు ఫలించవు. దూరపు బంధువుల నుంచి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి ఉంటారు వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. నడుము నొప్పి ఇబ్బంది పెడుతుంది.


ఈ వారం కా‘ర్టూన్స్’



'కుక్కుట' శాస్త్ర ప్రకారం, 2029 వరకు దీనికి విజయం లకేది లేదు!!
జ్యోతిష్యం

TV
ఆ సినీ హీరో ప్రతీ వారం హాజరు వేయించుకోడానికి వెళ్ళే పోలీస్ స్టేషన్ మార్గం అంతా ట్రాఫిక్ ఆంక్షలు విధించబడ్డాయి.. వాహన దారులు వేరే మార్గం ద్వారా వెళ్ళాలి.....!!!

సరిగ్గా భోగిమంటల టైం కు బుక్ ఫెయిర్లు పెడతారు కదా!?
మిర్చి
_బుక్ ఫెయిర్_





పోర్చుగల్‌లోని సినత్రా నగరంలో ఉన్న ఈ కోటను 'పెనా ప్యాలస్' అంటారు. దీనిని సినత్రా పర్వతంపై నిర్మించారు. వివిధ వర్ణాలతో నిర్మించిన పెనా ప్యాలస్ యునెస్కో గుర్తింపు పొందింది.





